



# బోస్కో మార్గం




కుటుంబ మాస పత్రిక VOL : 08 ISSUE : 4 APRIL 2010 ఏప్రిల్


## మరణం మానవ సహజం

## మృత్యువునుండి జీవానికి మరలా లేవడం దేవుని నైజం



# బోస్కో మార్గం



కుటుంబ మాస పత్రిక

సంపుటి : 8 ఏప్రిల్ - 2010 సంచిక : 4

*ప్రచురణ కర్త, సంపాదకులు:*

**ఫా. సెబాస్టియన్ జాన్,** ఎస్.డి.బి.

*మేనేజింగ్ ఎడిటర్ :*

**ఫా. బాలి యర్రమనేని,** ఎస్.డి.బి.

సెల్ : 9908246319

*సహాయ సంపాదకులు :*

**పి. అజరయ్య**

*సర్క్యులేషన్ మేనేజర్ :*

**శ్రీమతి బి. ఇన్నాశమ్మ**

*ఎడిటోరియల్ బోర్డ్ :*

ఫాదర్ తాతిరెడ్డి విజయ భాస్కర్

బ్రదర్ విన్సెంట్ కస్తిలీనో

ఫాదర్ మిరియాల బాలకిషోర్

ఫాదర్ గోపు పీటర్

*ప్రచురణాలయం :*

దాన్‌బోస్కో టెక్నికల్ స్కూల్ ప్రెస్

రింగ్‌రోడ్ - గుంటూరు - 522 007

*పత్రిక కావలసినవారు ఎడిటర్ లేదా ప్రచురణాలయం పేరిట ఎం.ఓ. చేసి పొందవచ్చును.*

సంవత్సర చందా : 75 రూ.

విడి పత్రిక : 7 రూ.

## పత్రికాను క్రమణిక


| | |
|---|---|
| సంపాదకీయం | 2 |
| ఉత్థాన పండుగ పరిశుద్ధ విజయ మహోత్సవం | 4 |
| పునరుత్థాన కథనాన్ని ఎందుకు విశ్వసిస్తున్నానంటే | 5 |
| జీవ వైద్య రక్షణ మనందరి బాధ్యత | 8 |
| కృపా మార్గం | 10 |
| ఆనందమా! నీ చిరునామా ఎక్కడ? | 12 |
| ఫాదర్ జియోసెప్పే మోజా | 14 |
| సిలువ దిగిన వీరుడు | 15 |
| స్వకీయ దివ్య దర్శనాలు | 16 |
| బడికి మానుకున్న బాలుడు... | 18 |
| యాజకుడు అంటే ఎవరు? | 20 |
| శ్రీసభ సమాచారాలు | 22 |
| సలేషియా సమాచారాలు | 23 |
| బైబిల్ క్విజ్ | 24 |


**గమనిక:** బోస్కో మార్గం కుటుంబ మాస పత్రిక పాఠకులకు నమస్కారములు. సంవత్సర చందా 75/- రూ.లు పంపి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసిందిగా కోరుచున్నాము. కనుక దయచేసి తమ చందాలను త్వరగా పంపించి మాతో సహకరించవలసిందిగా మనవి. *- ఎడిటర్*

# సంపాదకునికి లేఖలు




'బోస్కో మార్గం' పత్రికను ఆసక్తిగా, ఆతృతతో చదివే పాఠకుణ్ణి నేను. అందు ప్రచురితమయ్యే వ్యాసాలన్నీ స్ఫూర్తిమంతమై ఆలోచింప జేసేవిగా ఉన్నాయి. మీకు అభినందనలు తెల్పుతున్నాను. ప్రతి సంచికలో సమకాలీన స్వభావాన్ని ప్రముఖంగా నొక్కి చెప్పడం బాగుంది. లక్కిశెట్టి ప్రవీణ్ ఎస్.డి.బి.గారి సూక్ష్మ మానసం, భావనా విస్పష్టతలకు అభినందనలు! ప్రేమతో...

- జోస్ తెరంపిల్ ఎస్.డి.బి., కరుణాపురం

పత్రికా ముఖంగా జరుగుతున్న సువార్త ప్రబోధం, ఈనాడు ఆంధ్ర కతోలిక సంఘంలో ఒక వినూత్న దశకు చేరింది. ఆంధ్ర కతోలిక శ్రీసభ, గతంలో భాష నెరుగని మిషనరీలు పత్రికలు ప్రచురించినా, ఏమంత ప్రతిభావంతంగా రాణించ లేదు. నేటి పరిస్థితి వేరు. అపోస్తులు పౌలువారి రచనల్ని ఉద్దేశించి 'యింతటి లోతైన భావజాలం ప్రతిభింభిస్తూ, భాష ఎలాగ భరించ గల్గిందో!' అని విస్తుపోయిన పండితుని గురించి, ఫాదర్ పూదోట జోజయ్యగారు ఎస్.జె. ఒకచోట ఉదహరించారు. అటువంటి నూతన వేద గ్రంథాలలోని నిగూఢ తాత్పర్యాలను, నేటి కతోలిక పత్రికలు ప్రచురిస్తూ, సాధారణ విశ్వాసులను సైతం, దైవశాస్త్ర పండితులనుగా, రీసెర్చి స్కాలర్స్‌గా పాఠకులను తీర్చి దిద్దుతున్నారు. 'బోస్కో మార్గం' గురుజీవిత విషయములను కూడా పలుకోణాల్లో పాఠకులకు వివరిస్తున్న తీరు ప్రశంసనీయం. ఇది గురు-వార్షిక విశేషమని భావిస్తున్నాను, అభినందిస్తున్నాను.

- అజరయ్య, కర్నూలు.

గౌరవనీయులైన ఎడిటర్‌గారికి! 2010 మార్చి మాసంలో "మానవత్వం పరిమళించిన వేళ... ప్రార్థనలు ఫలించిన వేళ..." అనే శీర్షికలో యువ గురువైన రెవ. ఫా. గోపు పీటర్‌గారి స్వీయ సాక్ష్యాన్ని కనులకు కట్టినట్టుగా వివరించారు. ఫాదర్ పీటర్‌గారికి అభినందనలు. భవిష్యత్తులో ఇంకా ఇలాంటి సజీవ సాక్ష్యాల ద్వారా బోస్కో మార్గం పాఠకులను ఆకర్షించి, ప్రభు యేసు మార్గంలో నడిపించగలరని ఎడిటర్‌గారిని కోరుకుంటూ మనసారా అభినందిస్తున్నాను.

- శ్రీమతి బెల్లంకొండ ఇన్నాశమ్మ, గుంటూరు



సంపాదకీయం

# యేసు పునరుత్థాన ప్రాముఖ్యత

మానవుడు ఎంతో అభ్యుదయం సాధించి వున్నప్పటికీ, మరణాన్ని ఫలప్రదంగా నిర్మూలించాల్సిన కర్తవ్యం యింకా మిగిలేవుంది. మరణం అనేది పాపం వల్ల కలిగిన దుష్పరిణామం. రోమీయులకు వ్రాసిన లేఖలో పౌలుగారు ప్రకటిస్తున్నట్టు (6:23), పాపము యొక్క వేతనం 'మరణం'. నిజమే, యే మానవుడు తన సొంత ప్రయత్నాలతో దురదృష్టకరమైన ఈ దుష్ఫలితాన్నుండి తనను తాను మినహాయించుకోలేడు. "కనుకనే, ఒక్క మానవుని మూలమున పాపము ఈ లోకంలో ప్రవేశించిన నేపథ్యంలో, పాపము మూలమున మరణము చొరబడింది. అది, మనుషులందరికీ ప్రాపిస్తుంది. కారణం, అందరూ పాపం చేస్తున్నారు'' (రోమా 5:12).

మానవుడు తప్పించుకోలేని ఈ మృత్యు నేపథ్యంలో, యేసు పునరుత్థానం ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. రోమీయులకు వ్రాసిన లేఖ 6:23 ప్రకారం, ".... మన ప్రభువైన క్రీస్తు యేసులో దేవుని కృపానుగ్రహం, శాశ్వత జీవం.'' రోమా 5:17 వాక్యం కూడా చెపుతున్నదేమిటంటే, ఒక నరుని అతిక్రమణం ద్వారా, మరణం రాజ్యమేలుతుంటే, యేసుక్రీస్తు అనే మరొక నరుని నీతి ద్వారా దేవుని అపార కృపా అనుగ్రహాన్ని అందుకొనేవారు మరెంత ధన్యులో. దేవుడు ప్రసాదించే ఉచితమైన అత్యద్భుతమైన కృపానుగ్రహమైన నిత్యజీవ బహుమతి, యేసు పొందిన సిలువ మరణ ఫలితార్థమై యేసు పునరుత్థానంలో లభించింది.

యోహాను 11:25లో 'పునరుత్థానమును, జీవమును నేనే' అని యేసు చెప్పాడు, 'నన్ను విశ్వసించేవాడు జీవిస్తాడు, అతడు మరణించినా జీవిస్తాడు' అన్నాడు యేసు. ప్రభువు వాంగ్మూలం విపరీతంగానే ధ్వనిస్తుంది. ఐనప్పటికీ, మనం తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే, పాపమువల్ల మనమీదకు వచ్చిపడే భౌతిక మరణం చాలదన్నట్టు, ఆత్మీయ దురవస్థ, మరణం కూడా వుంది. అదేమిటంటే, దేవునితో సహవాసం చేయలేకపోవడం. పాపము నిమిత్తమై దేవుని గద్దింపును శిక్షను అనుభవించే స్థితిలో ఉండటం.


మన అతిక్రమాలకు పరిహారంగా యేసు బలిపెట్టబడి, మనని నీతిమంతులుగా తీర్మానించడం కోసం పునరుత్థానమైనాడు (రోమా 4:45). దేవునితో సఖ్యత కలిగి సహజీవనము చేయగల సదవకాశాన్ని మనకాయన కల్పించాడు (రోమా 5:1).

ఆయన పొందిన మరణం, పాపము విషయమైన శాశ్వత మరణం. ఆయన జీవిస్తున్న జీవం, దేవుని కొరకైన, దేవునిలోనైన శాశ్వత జీవం. పాపమునకై మరణం పొంది, క్రీస్తు యేసునందు దేవునికై నీవు జీవిస్తున్నావని, నిన్ను నీవు పరిగణించుకోగలవు.'' (రోమా 6:9-11).

యేసు మన కొరకు నిర్వహించిన కార్యాన్ని స్వీకరించిన తర్వాత, మనం నీతియుక్తంగా నడుచుకోగలం. "కనుక మీ మర్త్య శరీరమందు రాజ్యమేలడానికి పాపానికి అవకాశమివ్వకండి. దాని దుష్ట వాంఛలకు మీరు లోనుకావద్దండి. మీ శరీరములోని భాగాలను పాపానికి లోబర్చకండి. అలా లోబరచితే అవి దుష్ట క్రియలకు సాధనాలవుతాయి. అలా కాకుండా దేవునికి మిమ్ము మీరు సమర్పించండి. మరణాన్నుండి జీవానికి తీసుకరాబడిన వారిలాగా, మీ శరీర అవయువాలు నీతి సాధనాలుగా వాటిని దేవునికి సమర్పించండి'' (రోమా 6:12-13).

యేసు పునరుత్థానం ద్వారా క్రీస్తునందున్న వారిని మహిమాయుత శరీరాలతో పునరుత్థానం పొంద అనుమతిస్తుంది (1కొరింతీ 15:42-44). "భూ సంబంధమైన మానవ పోలికలో మనం జన్మించి వున్నట్టే, పరలోక సంబంధమైన మానవ పోలికను కూడా పొందగలము.'' (1కొరింతీ 15:49). ఇది నిజంగా భవిష్యత్తులో ఆసక్తి కలిగి అభిలషింప దగిన విషయం.

యేసు పునరుత్థానం - యేసు జీవిస్తున్నాడనీ, తండ్రి దేవుని ఎదుట మన కొరకు మధ్యవర్తిత్వ ప్రార్థన చేస్తున్నాడని అర్థమిస్తుంది. (రోమా 8:34). పాపము, మరణం యొక్క దుష్ప్రభావం నుండి విడుదల కలిగింపుమని, ఒక పునరుత్థాన అనుభవాన్ని కలిగింపుమని మనమెందుకు, ఆ ప్రభువును ప్రార్థించకూడదు? ఆయనతో పాటు మనమెందుకు పునరుత్థానం చెందకూడదు?






**ఫాదర్ జోస్ తెరంపిల్** ఎస్.డి.బి.,
కరుణాపురం

వసంత ఋతువులో వచ్చే క్రైస్తవుల పెద్ద పండుగ, పునరుత్థాన మహోత్సవం. క్రీస్తు సిలువలో మృతిబొంది, మరలా జీవమును పొంది లేచి వచ్చిన అద్భుత సంగతిని స్మరించుకొనే పండుగ యిది. ఈ పునరుత్థాన ఆదివారాన్ని పండుగగా ఆచరింపకపోతే, పెద్ద శుక్రవారపు సంస్మరణ దుర్భరంగా ఉంటుంది. మానవుని యావత్తు వృత్తాంతము, మూడు తోటల గాథ. మొదటిది, ఏధేను తోట; ఆ తోటలో పాపములో సమసిపోయిన సౌఖ్యము, రెండవది, గెత్సెమనే తోట, అక్కడ వేదన ఆరంభమై సిలువమీది క్రీస్తు బలితో ముగిసింది; కడపటిది పునరుత్థానతోట, యిది, ఏధేను, గెత్సెమనే తోటల వరసక్రమంలో చెప్పుకోబడే మరొక తోట - పునరుత్థాన తోట. సువార్త గ్రంథాలు పునరుత్థానాన్ని వివరించడం కన్నా పునరుత్థానం సువార్త గ్రంథాలను వివరిస్తున్నదని అనుటలో అతిశయోక్తిలేదు.

జి.బి. హార్డీ, తన 'కౌంట్ డౌన్' గ్రంథంలో పునరుత్థానం గురించిన భావోద్వేగ భరిత ఆలోచనల్ని మన కందించాడు. యేసు క్రీస్తు వారి పునరుత్థానం క్రైస్తవ విశ్వాసానికి మూలరాయి. అది లేనిదే, విశ్వాసి జీవితానికి, రానున్న జీవితానికి నమ్మకంలేదు. అపోస్తులైన పౌలు వ్రాసినట్టు "క్రీస్తు జీవంతో లేపబడకపోయివుంటే, మీ విశ్వాసము వ్యర్థమే'' (1కొరింతి 15:17). క్రీస్తు పునరుత్థానపు సంపూర్ణ నమోదు, యిదిగో యిదే. కన్ఫ్యూషియస్‌గారి సమాధి ఆక్రమణలో వుంది, బుద్ధుని సమాధి ఆక్రమింపబడి వుంది. మహమ్మద్‌గారి సమాధి ఆక్రమణలోనే వుంది. యేసు సమాధి ఖాళీగా వుంది. అందుచేత యేసు పునరుత్థానమయిన విషయం, వాస్తవికత! అసంఖ్యాకులు పునరుత్థాన అనుభవాన్ని ఎంచుకొని పరివర్తన చెందిన జీవితాలు సాక్ష్యమిస్తున్న ప్రకారం పునరుత్థానం అనేది నిజం. అది కట్టుకథ కాదు.

ఒకానొక గ్రామంలో ఒక పిచ్చివాడుండేవాడు. ఒకరాత్రి వాడు తన పరుపుమీద పడుకొని ఉన్నాడు. అలా పడుకొని ఒక బ్రహ్మాండమైన కొత్త ఆలోచన చేశాడు. రేపు ప్రొద్దుట సూర్యుడు ఉదయించ నీయకుండా వాడు అడ్డుకోదలచాడు. ఆ విధంగా అతడు అర్థరాత్రి లేచి, తన గది వెలుపలికి నడిచాడు. దగ్గరనే ఉన్న ఒక కొండ ఎక్కి, శిఖరాన్ని చేరాడు. అక్కణ్ణించి వాడు బిగ్గరగా అరచి చెప్పిందేమిటంటే : "ఓరి సూర్యుడా, ఉదయించవద్దు, నేను చెప్తున్నాను, ఉదయించవద్దు, నేను ఆజ్ఞాపిస్తున్నాను చూడు, ఉదయించవద్దు... నువ్వు ఉదయిస్తే చూడు, నిన్నేమి చేస్తానో?! పైకి ఎక్కొద్దు.'' వీడు ఎన్ని చెప్పినా సూర్యుడు మామూలుగానే ఉదయించాడు. ప్రథమాచార్యులు, పరిసయ్యులు కూడా ఆనాడు యిలాంటి తిక్క చేష్టలే చేశారు. వాళ్ళు సమాధిని భద్రపరిచారు. దానికి గవర్నరుగారి అధికార ముద్రతో సీలు చేశారు. దానిని

మూసివేసి, కావలి సిబ్బందిని నిలబెట్టారు. కానీ, జీవాధిపతిని వీళ్ళు పునరుత్థానం చెందనీయకుండా అడ్డుకోగలరా!

నజరేయుడైన యేసు, బాధను పరిశుద్ధ దివ్య సంస్కారముగా మార్చాడు. భవిష్యత్తు నమ్మికకు ఒక దేవద్రవ్యానుమానముగాను, ఒక సార్థక్యతగాను బాధావేదనను, మరణాన్ని మార్చివేశాడు. క్రైస్తవత్వంలో, బాధ-వేదనను అనుభవించడం, మహిమను పొందడంతో సన్నిహిత సంబంధం ఉంది. ముళ్ళ మకుటం లేనిదే, పునరుత్థాన ఆదివారపు మహిమాయుత శిరోభూషణం ఉండేది కాదేమో! క్రైస్తవ విశ్వాసి ఆశావాది, కాని నిరాశావాది కాడు, సూత్రాన్ని చెప్పే సిద్ధాంత కర్తకాడు. యేసులో దేవుణ్ణి చూచాడు. తాకి చూచాడు, అన్ని బాధా వేదనలు, అవమానాలు, దుర్మరణాన్ని సైతం అనుభవించి చూచాడు క్రైస్తవుడు. ఈ భూ మండలంపై ప్రేమను ఆచరించినప్పుడు, ప్రపంచంలోకెల్లా అదే అత్యద్భుత విషయమౌతుందని, పీటర్ దమియాను, మాక్సిమిలియన్ కోల్బే, ఆర్చిబిషప్ ఓస్కార్ రొమేరో, మదర్ తెరెస్సా, ఇండోర్ హతసాక్షి, సిస్టర్ రాణి మరియ ఎఫ్.సి.సి., బాబా ఆమ్టే తదితరులు తమ జీవితాలలో నిరూపించారు.

"దైవిక సర్వదయాళుత్వ లోకోపకారి'' అనే ఆలోచనను 'రావిల్లెరె' అనే ఫ్రెంచి జాతీయుడు పెంపొందింప జేశాడు. లోకాన్ని ఈ ప్రపంచంలోని యే వొక్క మతము కాపాడ నేరదన్నాడు. కనుక పొరపాటు లేని ఓ కొత్త మతాన్ని కనుగొనాలని, రూపొందించాలని ప్రయత్నం చేశాడు. తన క్రైస్తవ మతాన్ని విసర్జించి, అందులోని మంచి భావాలను తీసుకొన్నాడు. అలాగే ఇతర మతాలలోనుండి కూడ మంచి భావనల్ని గ్రహించాడు. దానికి అతడు, "దైవిక సర్వదయాళుత్వ లోకోపకారి'' అని నామకరణం చేశాడు. దానిని ప్రపంచమంతటా వ్యాప్తి చేయాలని ప్రయత్నించాడు. చాలా ద్రవ్యాన్ని కూడ ఖర్చుపెట్టాడు. ఐనా అతని కొత్త మతానికి కనీసం పదిమందినైనా సమకూర్చలేక పోయాడు. అతడు తన అత్యంత ప్రియమైన మిత్రుడు, బరస్ వద్దకెళ్ళి యిట్లడిగాడు, "నేను, అన్ని మతాల్లోని మంచి భావాలనెల్లా సేకరించుకొని కొత్త మతాన్ని ఏర్పాటు చేశాను. కాని అది ఎవరికీ పనికి రావడం లేదే ఎందుకంటావు?'' ఆ ప్రశ్నకు బారాస్ జవాబిస్తూ, "నీవు భలే పని చేశావు. కాని, నీ కొత్త మతం క్రైస్తవ్యంలాగా వ్యాప్తి చెందాలంటే, నీవు కూడా క్రీస్తు లాగానే ప్రవర్తించడం నేర్చుకోవాలి. ఒక మంచి శుక్రవారం నాడు మరణించి, ఆ తరువాత వచ్చే ఆదివారం నాడు జీవంతో లేచి రావాలి'' అన్నాడు.

నిజమే మరి. యేసు యేమేమి చేశారో, యేయే విలువలకోసం, ఆయన నిలిచారో వాటన్నింటినీ ఆ పునరుత్థానమే సమర్థించింది. దేవుని పరిపాలనను నిజం చేసింది. సత్యం కోసం నీతికోసం జీవించడం నిరర్థకం కాదని, మనకు ధైర్యాన్ని సాహసాన్ని యిస్తుంది. పునరుత్థానం, మరణాన్ని కబళించి వేసింది. మానవుని నూతన జీవానికి అంకురార్పణ చేసింది - పునరుత్థానం.

యేసు వారి ఖాళీ సమాధి, ఆశా నమ్మికకు చిహ్నమై పరిణమించింది. పునరుత్థానానికి సంకేతమైంది. "ప్రభువు లేచెను'' అనే సంక్షిప్త వాక్యము, యేసు ఎందు నిమిత్తము వచ్చారో, ఆ వివరమంతటినీ విశదీకరిస్తుంది. ఎమ్మాయు గ్రామానికి నడిచి వెళ్తుండిన ఆ యిద్దరు శిష్యులు నిరాశా నిస్పృహ, శూన్యభావన కలిగివుండిరి. వారి కలలన్నీ కకా వికలైనాయి. యేసు వారిలో నమ్మికను స్థిరపరచారు, వారికి దేవుని వాక్యము బోధించి, వారితో కలసి రొట్టె విరచారు. రొట్టె విరవడం అంటే ప్రభు భోజన దైవార్చన జరపటం. ఇకప్పుడు వారి జీవితాలకు ఓ క్రొత్త ప్రయాణం గోచరించింది. తాము ఏ చోటు నుండి పారిపోయారో తిరిగి ఆ చోటికే పరుగెత్తారు. వారి పెదవుల మీద "ప్రభువు లేచారు'' అనే వాక్యం ప్రతిధ్వనిస్తూ మారుమ్రోగింది.

ఆ విధంగా పునరుత్థాన ఆదివారం నాడు, మానవ జాతి చరిత్రలోనే సాటిలేని సంఘటనను స్మరించుకొంటాం. యేసు తన మిక్కిలి ప్రియమైన 'లాజరు' అనే మిత్రుణ్ణి సమాధి నుండి సజీవంగా బయటకు పిలిచాడు. ఐతే లాజరు మరలా మరణించాడు. కాని యేసుక్రీస్తు, మరణాన్ని జయించి బ్రతికి లేచాడు. మరెప్పటికీ ఆయన మరణించరు. ఆ విధంగా పునరుత్థాన ఆదివారం నాడు మనం, మరణంపై జీవం పొందిన విజయమహోత్సవము పండుగగా కొనియాడుతున్నాము. ఆయన పునరుత్థాన విజయము మన పునరుత్థాన విజయానికి హామీ, పూచీ, భరోసా యిస్తుంది. ప్రియ మిత్రులారా! మనం పునరుత్థాన ప్రజలము. "హల్లెలూయ'' గీతమే మన ఆనంద గేయం. మనం, పునరుత్థాన ప్రభునికి చెందే ప్రజలము. మన హృదయాలను, మన గృహాలను ఆయన శాంతి, సంతోషాలతో నింపుదురుగాక. ముప్పయి వెండి రూకల కొరకైన ధనదాహాన్ని మరచిపోదాం. పవిత్ర పునరుత్థాన మాధుర్యాన్ని చవిచూద్దాం, సంతోషిద్దాం. హల్లెలూయా!!



# పునరుత్థాన కథనాన్ని ఎందుకు విశ్వసిస్తున్నానంటే...

- పి. అజరయ్య, కర్నూలు.

యేసు మనం ఊహించలేని అత్యంత వేదనా భరితమైన మరణ శిక్షను అనుభవించివున్నాడు. ఆయన వీపు, పార్శ్వభాగాలు లోతైన గాయాలు కలిగి వున్నాయి- కొరడా దెబ్బలతో చీలికలు-పీలికలైన శరీరమది. హస్తాల్లో పాదాల్లో, సిలువకు బిగింపబడిన మేకుల గాయాలున్నాయి. ప్రభువు ప్రక్కలో పెద్ద ఈటె పోటువల్ల కలిగిన, గుండెను గాయపర్చిన సొరంగం ఉంది. శరీరంలోని యితర భాగాల్లో కలిగిన గాయాలు, యేసు అనుభవించిన కఠోర వేదనకు సాక్ష్యాలై నిలిచి వున్నాయి; ముళ్ళ కిరీటం, పరిహాసం చేస్తూ పిడిగ్రుద్దులతో, ముఖము మీద వేసిన ఉమ్మివల్ల, అనుభవించిన మనో వేదనకు నిదర్శనాలై నిల్చినాయి. సిలువను మోస్తూ క్రింద పడిపోయినప్పటి సందర్భాలు ప్రయాసకు దర్పణం పట్టుతున్నాయి. కపాల స్థలం చేరే వరకూ కొండమీదికి సిలువను మోశారాయన! అక్కడ ఆయనను ఇద్దరు నేరస్థుల మధ్య సిలువకు కొట్టారు.

అరిమత్తయి యోసేపు అనే ఒక ధనికునికి యేసు దేహాన్ని, అధికారులు అప్పగించారు. యూదుల న్యాయస్థాన సభ్యుడనీ, శాన్ హెడ్రిన్ మహాసభకు చెందిన వాడనీ, యేసుపై అబద్ధసాక్ష్యాలు చెప్పించిన ప్రముఖులలో ఒకడనీ అధికారులితన్ని భావించారు. ఈ యోసేపును, యేసు మిత్రుడని కాక ఆయన శత్రువని అనుకున్నారు వాళ్ళు. మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, తాను మరణించినప్పుడు తన కోసమే ఉపయోగించుకోడానికి యోసేపు సిద్ధపర్చుకొని వున్న సమాధిలో యేసు దేహాన్ని భద్రపర్చడానికి యోసేపు కోరుకున్నాడు. ఒక శుద్ధమైన వస్త్రం కొనితెచ్చాడు. ఆ శరీరానికి చుట్టి సమాధిలో ఉంచి, గుహలాంటి ఆ సమాధి ద్వారాన్ని పెద్ద రాతి గుండు దొర్లించి మూసి వేయించాడు.

ఆయన శిష్యులు దేహాన్ని దొంగిలించుకపోతారని భయపడి, మరియు యేసు బ్రతికి వున్నాడనే వదంతులు పుట్టిస్తారని, యేసుని చంపించినవాళ్ళు, అధికారులను ఒప్పించి, సైనికులచేత పగలు రాత్రి కాపలా కాయించారు సమాధిని!

## పరిస్థితుల సాక్ష్యం

పాస్క పండుగకు ముందటి రోజున యేసును సిలువ వేయడం జరిగింది. యూదుల సాంప్రదాయం ప్రకారం, సమాధిచేసే ముందు భౌతిక దేహానికి చేయవల్సిన సుగంధ తైల పరిమళాలు పూయడం జరగలేదు. అందుకు సమయం లేకపోయింది. ఆ సంవత్సరం పాస్క పండుగ,

వారం వారం వచ్చే సబ్బాతు దినాన రావడం యాధృచ్ఛికంగా జరిగింది. ఆ సబ్బాతు దినం మహా దొడ్డ దినముగా పరిగణింపబడింది. పవిత్ర దినం నాడు పరిశ్రమించి పనిచేయడం మహాపాపమని యూదుల చట్టం శాసిస్తుంది. అందువల్ల యేసు దేహానికి సముచిత రీతిన తైలాభిషేకం చేయడం శనివారం సాధ్యం కాలేదు. కనుక యేసు అనుచరులలో కొందరు స్త్రీలు, మూడవ నాడు ప్రాతః కాలమున, సుగంధ పరిమళ ద్రవ్యాలను తీసుకొని సమాధికి చేరుకున్నారు-యేసు దేహాన్ని సుగంధ తైలాలతో పూసి, తరించాలన్నది వారి ఆశ, తపన! అయితే దేహం లేదు! సమాధికి మూసిన రాయి అల్లంత దూరాన దొర్లిపోయి వుంది!!

అసలు ఏమి జరిగిందో అర్థం చేసుకోవడానికి శిష్యులు, పునరుత్థానుడైన యేసుతోనే ఎదురుపడాల్సి వచ్చింది! అవును, మృతుల లోకం నుండి యేసు సజీవుడై లేచి వచ్చాడు! ఈ వార్త త్వరితంగా ప్రాకిపోయింది!

అత్యధిక సంఖ్యాకులు మరి యెక్కువ హేతుబద్ధమైన వివరణను నమ్మేలాగ, యేసు శత్రువులు కథలల్లారు. యేసు శిష్యులు ఆయన దేహాన్ని తస్కరించుకొని వెళ్ళారనీ, ఆయన బ్రతికే వున్నాడని, కట్టు కథలల్లారు; ఆయన శత్రువులు, సమాదికి కాపలా కాచిన వారికి సైతము లంచము ముట్టజెప్పి, వాళ్ళు నిద్రిస్తుండగా శిష్యులు ఆయన దేహాన్ని ఎత్తుకెళ్ళారని చెప్పండని ఆ సైనికులను కోరారు.

"ఎత్తుకెళ్ళిన దేహం'' నేపథ్యంలోని ప్రజలు, ఎవరని విచారిస్తే, ఈ జరిగిన సంగతుల కారకులు ఎవరనగా యేసుకు విరోధంగా అసత్యారోపణలు చేసిన వారు, రోమా గవర్నరును ఒప్పించినవారు, యేసుకు మరణ శిక్షను వేయించిన వారు, వీరే. మరింకా, రక్షకుని పునరుత్థానాన్ని చాటి చెపుతున్న వారు, ఈ వాదం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేయ సిద్ధపడి వున్న వారిని కూడ విచారించితే, మనం ఎవరిని నమ్ముతాము?

**ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం :**

సువార్త గ్రంథంలో పునరుత్థాన ఘట్టాన్ని కళ్ళజూచిన (కనీసం 16) పదహారు మందిని పేర్కొంటుంది. రక్షకుని పునరుత్థాన అనంతర 40 రోజుల్లో, తాను శ్రమలనుభవించి మరణించిన తర్వాత సజీవుడై, పొరబాటుకు ఆస్కారం లేని విధంగా తనను తాను కనబర్చుకున్నాడు (అపోస్తుల కార్యములు 1:3, 13:31). ఒక్కసారే ఆయన 500 మందికి పైగా నున్న ప్రజల ఎదుట నిలబడి, అందరినీ ఆశీర్వదిస్తూ ఆరోహణమయ్యారు.

అపోస్తులైన పేతురు యిలా సాక్ష్యమిస్తున్నాడు: "మన ప్రభువగు యేసుక్రీస్తు యొక్క మహత్తరమగు ఆగమనమును మీకు తెలియచేయుటలో మేము కట్టు కథలపై ఆధారపడలేదు. మా కన్నులారా మేము ఆయన గొప్పతనమును కాంచితిమి'' (2 పేతురు 1:16).

అపోస్తులైన యోహాను చెప్పున్నది కూడ గమనార్హము: "సృష్టి ఆరంభమునుండి గల జీవ వాక్కును గూర్చి మేము మీకు తెలుపుచున్నాము. మేము దానిని చెవులారా విని కన్నులారా కాంచితిమి. కన్నులారా కాంచుటయేగాదు, మా చేతులు దానిని స్పృశించినవి. పిత తోడను, కుమారుడగు యేసుక్రీస్తు తోడను మాకు గల సహవాసములో మీరును మాతో చేరుటకై, మేము వినినవియు అగు వానిని మీకు తెలియజెప్పుచున్నాము (1 యోహాను 1:1,3)

ప్రత్యక్ష్య సాక్షుల కథనాన్ని కాదనలేము. ముఖ్యంగా ఆ సాక్షులు, తాము యేసుయొక్క తొలి శిష్యులమని చెప్తూ తాము చెప్తున్న సాక్ష్యం కోసం, హింసలైనా, మరణమైనా అనుభవించడానికి సిద్ధపడి వున్నప్పుడు, వారి వాంగ్మూలాన్ని శంకించడం కష్టం. కట్టు కథలని తెల్సిన వాటికోసం ఎవ్వరూ తమ ప్రాణాలను అర్పించరు. పునరుత్థాన ఘటాన్ని విశ్వసించడానికి అడ్డంకులూ, ఆటంకాలూ, సైతాను శక్తుల వల్లనే కలుగుతుంటాయి. పునరుత్థానాన్ని విశ్వసించడం సముచితం, సత్యం.

# జీవ వైవిధ్య రక్షణ మనందరి బాధ్యత : శ్రీసభ స్పందన

## (అంతర్జాతీయ జీవ వైవిధ్య పరిరక్షణ సంవత్సర ప్రత్యేకం)



బ్రదర్ లక్కిశెట్టి ప్రవీణ్,
డాన్‌బోస్కో, గుణదల

"దేవుడు తాను చేసిన సృష్టి అంతయు చూచెను. ఆయన కంటికి అది చాలా బాగుగానుండెను'' నూతన సహస్రాబ్దిలో ఒక దశాబ్దం చివరకు చేరాం. కాలం మన కళ్ళెదుటే కరిగిపోతుంది. ప్రపంచంలోని ఆధునిక సాంకేతిక అత్యున్నత శిఖరములకు చేరే ప్రయత్నంలో 2020వ సంవత్సరమునకు పది సంవత్సరముల దూరంలో ఉన్నాం. ప్రపంచ దేశాలన్నీ అభివృద్దే ధ్యేయంగా పరుగులిడుతున్నాయి. అగ్ర దేశాలు మొదలు, చిన్నా చితక దేశాల వరకు అభివృద్దే మంత్రంగా దూసుకుపోతున్నాయి. కాని, ప్రపంచ దేశాలు అన్నీ ఒక విషయమును మరిచాయి. అదే, ప్రాణకోటికి, జీవరాసులకు ప్రత్యక్ష్యంగా పరోక్షంగా తలపెడుతున్న హాని. ఈ పెను సవాలును ధీటుగా ఎదుర్కొనుటకు ఐక్యరాజ్య సమితి 2010వ సంవత్సరమును అంతర్జాతీయ జీవ వైవిధ్య రక్షణ సంవత్సరముగా ప్రకటించింది. ఒకే ఒక లక్ష్యం: మనం నివసిస్తున్న ఈ గ్రహమును (భూమిని) కాపాడుకొనుటకు, మానవ, జీవరాసుల జీవనమును సుగమం చేయుటకు, ఈ లక్ష్యం మనందరిది.

2009 డిసెంబర్ 7-18 తేదీలలో డెన్మార్క్ దేశంలోని కోపన్‌హాగన్ పట్టణంలో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సు ఎన్నో ఆశలను రేకెత్తినా, చివరకు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ప్రపంచ దేశాలు ఒకరినొకరు సాధించుకొని తిరిగి వెళ్ళాయి. 192 దేశాలు పాల్గొన్న సదస్సు చివరకు నీరుగారిపోయింది. భూమి వేడెక్కటం, ఉష్ణోగ్రతలను తగ్గించుట, కాలుష్యం, తరుగుదల, ఆహార సమతుల్యత మొదలగు అంశములతో ప్రారంభమైనప్పటికీ, కోపెన్‌హాగన్ సదస్సు నల్లేరుపై నడకలా సాగి ముగిసింది. డిసెంబరు 7, 2009, న 45 దేశలకు చెందిన 53 ప్రముఖ వార్తా పత్రికలు మూకుమ్మడిగా పర్యావరణపై ఒకే సంపాదకీయమును ప్రచురించి పర్యావరణ రక్షణ అందరి బాధ్యతగా చాటినా, కార్యాచరణలో ఘోర విఫలమయ్యారు.

ఎందుకింత వ్యథా, ప్రయాస? కారణం: త్వరలో ప్రపంచం అంతా కలసి ఒక నిర్ణయం తీసుకొని పర్యావరణను రక్షించనిచో, మనం నివసిస్తున్న భూమి కకావికలం అవుతుంది. ఇప్పటికే ఎన్నో అవాంఛనీయ దుర్ఘటనలకు, పర్యవసనాలను ఎదుర్కొంటున్న మనం త్వరలో ఘోర విపత్తులను చవి చూడవలసివస్తుంది. ఆలోచన చేసే సమయం కూడా దాటిపోయింది. గడచిన 14 సంవత్సరములలో 11 సంవత్సరములు అత్యంత ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పుడు మనం ఉన్న పరిస్థితి నిందలకు గాక, జరిగిన నష్టమును రూపుమార్చి రానున్న ఉప్పెనను ఆపుట. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు మనకు చెప్పే విషయం: నిరాశావాదంపై ఆశావాదం యొక్క గెలుపు, నియంత్రణ

దృష్టిపై దూర దృష్టి గెలుపు, అత్యాశపై అవసరత యొక్క విజయమును గురించి, ఈ అవగాహన అందరిలో ప్రారంభమై వికసిల్లినప్పుడే ప్రాణకోటి జీవనం సుగమం అవుతుంది. ఈ ప్రక్రియలో అందరి పాత్ర భేషుగ్గా సాగాలి. పరిస్థితులు విషమంగా మారక మునుపే మేల్కొనాలి. ఇది మనందరి నైతిక బాధ్యత.

'కాసే చెట్టుకే రాళ్ళ దెబ్బలు' అన్నట్లు జీవనమునకు సర్వవేళలా తోడ్పడే జీవరాసులు, పక్షులు, చెట్లు, చేమలకే కష్టాలు ఎక్కువ. మన జీవనమునకు వినియోగించబడుతున్న జీవరాసుల, ప్రాణుల జీవనం కూడా సాఫీగా కొనసాగునట్లు చూచుట మనందరి బాధ్యత. అవసరమునకు మించి అత్యాశకు పోతే మన మధ్య కొట్లాటలు, విభజనలు తథ్యం. ఆర్థిక వ్యవస్థ క్షీణించుట ఖాయం. మరోవైపు అవసరమునకు మించి జీవరాసులను, చెట్లు చేమలను విచ్చలవిడిగా వాడినచో రానున్న తరాలకు ఏమీ మిగలవు. మనం పీల్చే గాలి, త్రాగునీరు, వాతావరణ పరిశుభ్రత మన పూర్వీకులు అందించిన ఫలం. వారు వాడిన పిదప ఎక్కువ భాగమును నేటి మన వినియోగమునకు అందించారు. స్వార్థ పూరిత ప్రయోజనములకు వెళ్ళక, మన గురించి ఆలోచించి ఈ పర్యావరణమును మనకందించారు. మన బాధ్యతగా, నేటి పర్యావరణమును మెరుగైన స్థితిలో అందించగలగాలి. దానినే, ఆర్థిక శాస్త్ర పరిభాషలో సమతుల్య అభివృద్ధి " Sustainable Development " అంటారు. ఒకప్పుడు విరివిగా లభ్యమైన నీటిని నేడు మనం కొనవలసి వస్తుందంటే కారణం; స్వార్థం. ఒకప్పుడు చూసిన పిచ్చుకలు, పక్షులు నేడు అంతరించి పోయాయి. కారణం: కాలుష్యం, అధిక ఉష్ణోగ్రతలు. తద్వారా జీవనం, జీవరాసుల గమనం సహజత్వమును కోల్పోతుంది.

**జీవ వైవిధ్య రక్షణ : శ్రీ సభ స్పందన :** నేటి వరకూ జరుగుచున్న ఈ జీవరాసుల దోపిడిలో అందరూ సమానంగా బాధ్యులే. భూకంపాలు, అధిక ఉష్ణోగ్రత, సునామీలు, హరికేన్‌లు, వరదల రూపంలో ప్రకృతి విలయ తాండవం చేస్తుందంటే, ఏ ఒక్కరినీ, ఏ మతమునూ, వ్యవస్థనూ నిందించలేము. పర్యావరణ పరిరక్షణలో, జీవరాసుల రక్షణలో శ్రీసభ పాత్ర చాలా ముఖ్యమైనది. ఆదికాండం, మొదటి అధ్యాయం, విశ్వసృష్టి, సకల ప్రాణికోటి ప్రారంభం గూర్చి ప్రస్తావిస్తుంది. దేవుడు ఈ లోకమును ఆయన సృష్టించి, సకల ప్రాణులను దానియందుంచెను. " దేవుడు తాను చేసిన సృష్టి అంతయు చూచెను. ఆయన కంటికి అది చాల బాగుగా నుండెను'' (ఆది 1:31). ఈ సృష్టిని బహు సుందరంగా చేసి దేవుడు మానవునికందించి, దానిపై అధికారమిచ్చెను. కాని నేడు, ఆ అధికారత సామర్థ్యంగా మారి సృష్టి అతలాకుతల మవుతుంది. కీర్తనలు 8, 24, 50, 104, 145, 148 ద్వారా కీర్తనా కారుడు సర్వసృష్టిని గూర్చి ప్రస్తావిస్తూ, స్తుతి మహిమలు చెల్లిస్తాడు.

దానియేలు ప్రవక్త ముగ్గురు యువ్వనుల కీర్తన ద్వారా దేవునికి స్తుతి ఆరాధన చెల్లిస్తాడు. సృష్టిలోని సకల ప్రాణులు నిండైన జీవం కలిగి సృష్టించిన దేవునికి స్తుతి మహిమలను చెల్లించాలి. కాని, నేటి రోజులలో సకల ప్రాణకోటి దేవునికి చేసే స్తుతి ఆరాధన ఎంతవరకు సాధ్యమో ప్రశ్నార్థకం! ఎందుకనగా, సృష్టిలోని జీవరాసులు రోజు రోజుకీ అంతం కావించబడుతున్నాయి. నూతన నిబంధనలో క్రీస్తు తరచూ తన ఉపమానములను సృష్టిలోని ప్రాణులతో పోల్చుతూ వాటి ప్రాముఖ్యతను ప్రస్ఫుటం చేశాడు. మన పవిత్ర గ్రంథం బైబిలు, ఇంత గాఢంగా సృష్టిలోని జీవరాసులు, వాటి పరిరక్షణ, దేవునికి అర్పించు స్తుతి మహిమలను ప్రస్తావిస్తుండగా, శ్రీసభ బిడ్డలుగా, జీవ వైవిధ్యమును పరిరక్షించేబాధ్యత ఎంతైనా ఉంది. పర్యావరణం, జీవరాసుల పరిరక్షణపై ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన అవగాహన మరింత దృఢమై ఈ సృష్టి, మన మనుగడ సుగమం కావాలని దేవుని ప్రార్థిద్దాం.

**ప్రార్థన :** సకల సృష్టి కర్తా! సకల ప్రాణ కోటిని సృష్టించి మానవుని ఉపయోగార్థం మీరు ఒసగితిరే! మీరు మా కందించిన ఈ సుందర సృష్టిని, వాటిలోని సకల ప్రాణులను మేము ఎల్లప్పుడూ పరిరక్షిస్తూ, మా జీవన గమనమును, సకల ప్రాణ కోటి మనుగడను సుగమం చేయుటలో మా లోని స్వార్థమును తీసివేసి, పర్యావరణ పరిరక్షకులుగా మాకు అనుగ్రహమును దయచేయండి. ఆమెన్. ❋

# కృపా మార్గం



**ఫాదర్ జయబాబు నూతలపాటి**
సి.పి.పి.ఎస్. యు.ఎస్.ఏ.



మానవ జీవితము శోధనలతో కూడుకొని ఉన్నది. మన మందరము ఏదో ఒక శోధనలో పడుతూనే ఉంటాము. అయితే పడినవారు కొంతమంది దేవుని కృపవలన పైకి లేస్తారు. మరికొందరు శోధనల సుడిగుండంలో చిక్కుకుపోతారు. నిజానికి, లేచినవారు సమర్థులు, శోధనలో చిక్కుకున్న వారు అసమర్థులు అని చెప్పవచ్చును.

**1) అందరికి అనుకూలమైన దేవుని కృప :** "దేవుడు చాలా గొప్పవాడు'' అని చాలా చక్కగా చెబుతాం. నిజమే సుమా! దేవుడు గొప్పవాడు. ఆయన అందరిని అన్నింటిని సృష్టించిన దేవుడు. అంతేకాకుండా, నిన్ను నన్ను తన రూపు రేఖలతో కలుగజేసాడు (ఆది. 1:26). అనగా దేవుడు మానవులందరికి గొప్ప జ్ఞానమును, బుద్ధిని ఇచ్చాడు. అదే విజ్ఞానమునకు మొదటి మెట్టు - మరియు పవిత్రుడైన ప్రభుని తెలిసికొనుట వివేకము (సామె. 9:10). అవును, దేవుని వాక్కు అక్షరాలా సత్యము. ఈనాటి యువతీ, యువకులు మరియు అనేకమంది దేవునిపట్ల భయభక్తులు చూపలేకపోతున్నాం. ఏదో ఉడతా భక్తి లేదా, నామమాత్రంగా జీవిస్తున్నాము. మరీ ముఖ్యంగా రోజు రోజుకి పెరిగిపోతున్న సాంకేతిక పరిజ్ఞానం అనే మాయలోపడిపోయి, సర్వ శక్తిమంతులైన నిజ దేవుణ్ని మరచిపోతున్నాము.

ఒకప్పుడు అమెరికా ఎంతో ఆర్థిక అభివృద్ధి సాధించిన దేశము. కాని ఇప్పుడు అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుంటుబడిపోయింది. ప్రతిరోజు నాలుగు లేక ఐదు గురు యువతలు నా దగ్గరకు వచ్చి ఫాదర్ నా ఉద్యోగం పోయింది, నా కోసం ప్రార్థించండి అంటూ వ్యధపడుచున్నారు. వారి జీవితమును పరిశీలించి చూస్తే వారిలో దైవ భయము చాలా లోపించింది. మరో ప్రక్క కొంతమంది, ఎవరైతే దేవునియందు భయభక్తులు కలిగి జీవిస్తున్నారో వారు మంచి ఉద్యోగంలో, సంతోషముతో జీవిస్తున్నారు.

ఫిబ్రవరి 14వ తేదీన, మార్కు (37) అనే ఒక సహోదరుడు నా దగ్గరకు వచ్చి, ఫాదర్ నేను ఒక కతోలికుడుగా ఉన్నందుకు గర్విస్తున్నాను. నా తోటి స్నేహితులు ఎంతో మంచి ఉద్యోగాలు కోల్పోయారు. కాని దేవుడు నాకు ప్రమోషన్ ఇచ్చాడు. కారణం నా విశ్వాస జీవితం మరియు అనుదిన ప్రార్థనా జీవితం.

అంతా సమముగానే వున్నా కొందరిలో మాత్రం అసమర్థత, బద్దకము, ఈలోక వ్యామోహము అధికమగుట వలన దేవునియందు భయభక్తులు అంతరించి పోతున్నాయి.

**2. బలహీన సమయములో బలపరచే కృప :** పునీత పౌలు ఈ విధంగా అంటున్నారు "నేను ఎప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను'' (2కొరింతి

12:10). బలహీన సమయంలో బలాన్ని చేకూర్చే దేవుడు ఎల్లప్పుడు మన పక్షాన ఉన్నాడు, కాని అనేక సమయాల్లో మనము దేవుని పక్షాన ఉండలేము. మానవ ప్రయత్నాలు మరియు అవిశ్వాస పూరిత కార్యక్రమాలలో నిమగ్నమౌతాము. దేవుని వాక్యం పలుకుతున్నట్లుగా "యావే మీ పక్షమున పోరాడును. మీరు కదలక మెదలక ఉండుడు'' (నిర్గమ 14:14).

బలహీనతలు, భయములు, ఆందోళనలు, అవమానములు, అనుదిన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలు. మన జీవితంలో సగ భాగాలు. వాటిని చూసి విసిరి వేసారి పోవద్దు. ఇదిగో మన దేవుని వాగ్దానాలను మరువ కూడదు ఆయన మారని దేవుడు, మాట మార్చని దేవుడు. కాని బలహీన సమయంలో మనము మారిపోతాము. అందుకే మనము జీవితంలో ఓడిపోతున్నాము. బలహీన సమయంలో ఈలోక శక్తులను చూసి మనము భయపడవద్దు. మనము ఎప్పుడైతే భయపడుచున్నామో అప్పుడు సైతాను ఆవరిస్తుంది. ఈరోజున మన రాష్ట్రంలో ఎంతోమంది యువతీ యువకులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?

ఎ. జీవితం అంటే భయము

బి. భవిష్యత్తును ఒంటరిగా ఊహించడం

సి. బలవంతుడైన దేవుని బలం తెలియకపోవడం

డి. దేవుడు ఇచ్చిన బంగారు భవిష్యత్తు విలువను తెలుసుకోలేక పోవడం.

"సమస్తము దేవుని ప్రణాళికను, నిర్ణయములను అనుసరించి జరుగును. ఆదియందే ఆయన నిశ్చయించు కొనిన దానిని బట్టి, దేవుడు మనలను తన ఉద్దేశము కొరకు క్రీస్తునందు తన ప్రజలనుగా ఎన్నుకొనెను (ఎఫెసీ 1:11). దేవుడు ప్రతి ఒక్కరికి ఒక ఉన్నతమైన విలువైన ప్రణాళికను ఏర్పాటు చేశాడు. కాని మనము ఆ నిజ ప్రణాళికను తెలుసుకోలేకపోతున్నాము. మరియు క్రీస్తునందు నిలకడగా, బలంగా నిలబడలేకపోతున్నాము. సమయము మించిపోలేదు, ఇప్పుడైన క్రీస్తులా నిలకడగా, నిశ్చింతగా, భయపడకుండా జీవించుదాం! ఎందువలనంటే ఆయన సత్యము, జీవము, మార్గము యోహాను 14:6. ఆయన ''ద్వారానే'' మనము బలపడతాము మరియు గమ్యస్థానాన్ని చేరుకుంటాము.

**3. బానిస సంకెళ్ళను త్రెంచి బ్రతికించగల దేవుని కృప:** తప్పిపోయిన కుమారుని కథనము మనందరికి బాగా తెలుసు. (లూకా 15:11-24). ఈ దుడుకు చిన్నవాడు ఆస్థికూడ బెట్టుకొని దూర దేశము వెళ్ళిపోయాడు. అనగా దేవుని యందు భయభక్తులకు, తండ్రి యొక్క ప్రేమకు దూరంగా వెళ్ళిపోయాడు. తనకున్నదంతా జల్సాలతో వెచ్చించాడు. తన సొంత శక్తిమీద పూర్తిగా ఆధారపడ్డాడు. దేవునికి కృపను, తండ్రి ప్రేమను పూర్తిగా మరచి పోయాడు.

మనము ఒక కొత్త కత్తికొని, పెరటిలో పెరిగిన చెట్టును నరికిన తరువాత భద్రంగా గుడ్డచుట్టి దాచిపెట్టి మూడు లేక నాలుగు నెలల తరువాత బయటకు తీస్తే ఎలా ఉంటుంది? చిలుము పట్టి తుప్పు పట్టి ఉంటుంది. అదే విధముగా మన జీవితంలో దేవుని కృపను, అవకాశమును సద్వినియోగపరచుకోకపోతే మనము కూడా భ్రష్టు పట్టిపోతాము. ఈ దుడుకు చిన్నవాడు భ్రష్టుపట్టి, పందుల కొట్టంలో మ్రగ్గిపోయాడు.

ఆ పందుల కొట్టంలో, దుర్వ్యసనంలో, మురికిలో, ఆకులలో, అజ్ఞానంలో, చీకటిలో ఒకసారి పైకి లేచి చూశాడు (లూకా 15:20). తండ్రి మహత్కరమైన ప్రేమను, కృపను గుర్తించాడు. తండ్రి దగ్గరకు పయనమై వచ్చాడు. "తనయుడు వస్తాడు'' అని గంపెడంత ఆశతో ఎదురు చూస్తున్న తండ్రి, కుమారుణ్ణి చూసి కౌగలించుకొని ముద్దు పెట్టుకొని, గొప్ప పండుగ చేశాడు.

మనము ఎక్కడ వున్నాము? ఏ అంధకారపు బంధనములో చిక్కుకున్నాం? ఏ శోధనలో పడిపోయాం? దేన్ని చూసి భయపడుతున్నాం. ఒక్కసారి దేవునివైపు చూద్దాం, మనము కూడా లేచి దేవుని కృపా సన్నిధిలోకి వద్దాం! దేవుడు మనల్ని తన గొప్ప కృపతో బలపరుస్తాడు. మన ఉన్నతమైన భవిష్యత్తును తీర్చిదిద్దుతాడు. దేవుడు తన కుమారుని మహిమ విందులో భాగాన్ని దయచేసి మనల్ని బలపరచి బాగు చేస్తాడు. ఇది అనుకూలమైన కృపా సమయము.



# ఆనందమా! నీ చిరునామా ఏది?



**కె. విజయకుమారి,** టీచర్
సెంట్ జోసఫ్స్ స్కూల్
గుంటూరు

ఆనందం అంటే సంతోషం. మనసు సంతోషంతో తేలిపోతుంది అంటాము. కోటి రూపాయలు ఖర్చు పెట్టినా ఆనందం దొరకదు. మరి ఎక్కడ దొరుకుతుంది?

పదహారేళ్ళ వయసులో ఆకర్షణలో ఉందనుకుంటాము, పాతికేళ్ళు వచ్చాక వివాహ బంధంలో ఉందనుకుంటాము. నలభైయేళ్ళు వయసులో ఉద్యోగంలో ఉందనుకుంటాము. యాభైలో పడిన తర్వాత కూడబెట్టిన ఆస్తిపాస్తులు ఆనందాన్నిస్తాయనుకుంటాము. అరవై దాటితే విశ్రాంతి తీసుకుంటే ఆనందం దొరుకుతుందనుకుంటాము. ఊహూ.... ఎక్కడా ఆనందం కనిపించదు.

మరి ఎక్కడ దొరుకుతుంది, ఈ ఆనందం? మద్యంలోనా? డబ్బులోనా? భోజనంలోనా? శృంగారంలోనా? రాజకీయ పదవిలోనా? ఈ ఒక్క ప్రశ్నకి జవాబు దొరికితే చాలు. ఆనందం చిరునామా దొరికినట్లే.

పసిపిల్లలను చూడండి. ఎంత హాయిగా నవ్వుతారో? పక్కకి తిరిగి పడుకున్నా, కూర్చున్నా, నిలబడగలిగినా, తప్పటడుగులు వేసినా ఆనందమే! మొదటిసారిగా 'అమ్మా! అని పలికినా ఆనందమే! ఇలా పెరిగే కొద్దీ, ఎన్నో అనుభూతులు. వాటివల్ల పొందే ఆనందాలు ఎన్నో! ప్రకృతిలో ప్రతి అణువును చూసి పులకించిపోవచ్చు. కరి మబ్బును చూసి, నెమలి పురివిప్పి ఆడినట్లు, తాదాత్మ్యత చెందితే మనసు కూడా నాట్యం చేస్తుంది. ఎగిరే పక్షుల గుంపు కొండల వరుసలు, గలగల పారే సెలయేరు, దుమికే జలపాతాలు, పచ్చనిచెట్లు, గరిక పచ్చ మైదానాలు, ఇంద్రధనుస్సు, తారకా సముదాయం, సూర్యోదయ సూర్యాస్తమయాలు యిలా అన్నీ మనకు ఆనందాన్నిచ్చేవే. కాకపోతే, వాటిలోని అందాలను ఆస్వాదించే మనసుండాలి.

జీవితం తక్కెడలాంటిది. కొన్నిసార్లు అటూ, యిటూగా మొగ్గుతుంది. అది సహజం. కానీ, మనం ఒకవైపు మొగ్గితే ఆనందిస్తాం. ఇంకోవైపు మొగ్గితే బాధపడతాము, అదే మంచిది కాదు. దేన్నయినా సమానంగా తీసుకోవాలి. వేసవి వస్తే ఎండల్ని భరిస్తాము. వర్షాకాలం వస్తే వానలకు సర్దుకుపోతాం. చలికాలం వస్తే చలికి తట్టుకుంటాం. జీవితంలోనూ అంతే! అవరోధాలకూ, కష్టాలకు తట్టుకోవాలి.

సంస్కృతంలో ఒకసామెత ఉంది. "నా సొంత ఊరు స్వర్గం. విశ్రాంతి కోసమే భూమి మీదకు వచ్చాను." అని

దానర్థం. నిజంగానే మనం యీ ప్రపంచానికొచ్చింది సంతోషంగా జీవించడానికే! హాయిగా ఉండడానికే. అలానే జీవించుదాము.

గతం నాస్తి. గతం మనచేతుల్లో లేదు. గతంలో ఏమీచేయలేదే అని బాధపడకూడదు. భవిష్యత్తును మనం ఊహించలేం. క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేం. మన చేతుల్లో ఉన్నది వర్తమానమే. వర్తమానంలో జీవించి, ఆనందంగా గడుపుదాం. అందుబాటులో ఉన్న దానిని అందుకొని ఆనందంగా గడుపుదాం. లేనిపోని అపోహలతో, భయాలతో, ఆలోచనలతో, జీవితంలోని ఆనందాన్ని దూరం చేసుకోకూడదు. అర్థములు నిత్యములుకావు. యవ్వనము ఝరీ వేగతుల్యము, జీవనము క్షణ భంగురం. ప్రాపంచిక విషయాలు ఏవీ శాశ్వతం కావు. ఏవీ ఆనందాన్ని యివ్వలేవు. ధార్మిక జీవనం, న్యాయమార్గం, క్రమశిక్షణ యివి మాత్రమే ఆనందాన్ని యిస్తాయి.

"ఆనందానికి ఏదైనా ఔషధం ఉందా?'' అని ఎవరైనా అడగొచ్చు. ఉంది. ఆనంద శిఖరాన్ని చేరుకోడానికి సోపానాలు ఉన్నాయి. ఆ సోపానాలు ఎక్కడున్నాయంటే - కారులో, బంగళాలో, బ్యాంకు బాలెన్స్‌లోనో ఉన్నాయనుకో వద్దు. ప్రపంచ విషయాల్లో ఆనందాన్ని వెతికే ప్రయత్నం చేసేకొద్దీ, విషాదం ఎదురవుతుంది. నిజమైన ఆనందం అంతరాంతరాల్లోంచి వస్తుంది.

గాదెలో ఉన్న గింజ "నేను చాలా గొప్పదానిని. ప్రాణం ఉన్న దానిని, ఆ మట్టితో స్నేహం చేయడమేమిటీ'' అనుకుంటే అది ఏ ఎలుకకో, పందికొక్కుకో ఆహారమవుతుంది. అలాకాక మట్టితో స్నేహం చేసుంటే, చక్కగా మొలకెత్తేది. మొక్కగా మారేది. పచ్చని పంటతో నలుగురికీ అన్నం పెట్టేది. అభిమానాన్ని సంపాదించుకునేది. గాదెలోని గింజలా ఆలోచించడం బాధకు కారణం. మొలకెత్తే విత్తులా ఆలోచించడం ఆనందానికి మూలం. అందరితో కలిసి మెలసి వుంటే అదే ఆనంద మార్గం అవుతుంది. ఇప్పుడు మనం ఆనంద శిఖరాలు చేరడానికి సోపానాల గురించి చెప్పుకుందాం.

**మొదటి సోపానం - ధ్యానం** : ఈ ధ్యానం మన మనసును మనం ఆధీనంలోనికి తీసుకురావడమే ధ్యానం. ఏకాగ్రతకు, నిలకడకు ధ్యానం ఉపయోగపడుతుంది. మనసు పక్కదారి పట్టదు. ప్రపంచ మార్గాలు మనల్ని చిత్తు చేస్తున్నప్పుడు ధ్యానం మనకెంతగానో తోడ్పడుతుంది. మాదక ద్రవ్యాలు, చెడు ఆలోచనలు వలన వచ్చే ఆనందం, ధ్యానానందం ముందు దిగదుడుపు. ధ్యానానందమే నిజమైన ఆనందం, నిత్యానందం.

**రెండవ సోపానం - ప్రార్థన:** ఆధ్యాత్మికతలో ఆనందం వుంది. ప్రేమ వుంది. స్వేచ్ఛవుంది. ప్రకృతిలోని అందాలను చూస్తే మనసులో కమ్మని భావన కలుగుతుంది. సృష్టికర్త ఎంత రసికుడో అనిపిస్తుంది. అనుభూతితో భగవంతుని తలచుకోవడం కూడ ప్రార్థనే. మాటలకు, స్తోత్రాలకు అందని ప్రార్థన అది. ఈ ప్రార్థన ద్వారా పొందే మానసికానందం ఎల్లలు లేనిది.

**మూడవ సోపానం - శ్రమ** : "కాయకమే కైలాసం'' అంటారు పూజ్యులు. శ్రమలోనే కైలాసం వుంది. కైలాసం అంటే మోక్షం. అక్కడ ఏముంది? ఆనందముంది. కాబట్టి ఆనందానికి మూలం శ్రమ. మనల్ని మనం మరచిపోయి పని చేయడమూ ధ్యానమే. మన పనిని మనం పరమ పవిత్రంగా భావించడం, బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం, అన్నిటికంటె గొప్ప వ్రతమని చెబుతారు పెద్దలు. పని ద్వారా పొందే శ్రమానందం విలువ అనిర్వచనీయం.


**నాలుగవ సోపానం - సేవ** : నిరాధారులకు, నిరాశ్రయులకు సేవను అందించాలి. అమ్మను ఎంతగా ప్రేమించి సేవను అందిస్తామో అలాగే ప్రతి ఒక్కరిలో అమ్మను దర్శించి, సేవలు అందిస్తే దానివల్ల పొందే ఆనందం మణి మాణిక్యాల కంటె అతీతం.

**ఐదవ సోపానం - కళలు** : సాహిత్యం మనకు ఆనందాన్ని ఎలా కలిగిస్తాయో ముందుగా తెలుసుకుందాము. మంచి పుస్తకం సద్గురువులాంటిది. జీవితమంటే ఏమిటో చెబుతుంది. ఎలా జీవించాలో చెబుతుంది. ఆలోచనల్ని అక్షర రూపంలో చదువుతున్నప్పుడు, మనలోని కాలుష్యం కొట్టుకుపోతుంది. మనసు పరిశుభ్రమవుతున్న భావన కలుగుతుంది. కళలూ అంతే! మనల్ని మనం ఆవిష్కరించుకొనడానికి మనలోని భావాలకు ఓ రూపం యివ్వడానికి వేదికలుగా నిలుస్తాయి. ఏ కళయైనా మనకి ఆనందాన్నియిస్తాయి.

ఇవే కాకుండా చిన్న చిన్న పనులు కూడా మనకు ఆనందాన్ని యిస్తాయి. మన ఎరుకలో ఎన్నో ఆనంద మఠాలు ఉన్నాయి. ఏ మఠానికైనా పరమాత్మ తత్త్వం తెలుసుకోవడానికో, ముక్తి మార్గం తెలుసుకోవడానికో వెళ్ళడం లేదు. ఆనంద ద్వారం తాళంచెవి అక్కడేమైనా దొరుకుతుందేమో అని ఆశగా వెళుతున్నారు. 'ఆనందం' విలువ తెలుసుకున్నాం కదా! "ఆనందో బ్రహ్మ - అంటారు అందుకే! ❋

# ఫాదర్ జియుసెప్పె మోజా ఎస్.డి.బి.

# (1915-2009)



2009 మే, 26న ఫాదర్ జియొసెప్పె ఎస్.డి.బి. గారు ఇటలీ దేశపు మిలాన్ నందలి అరేసే వద్ద 93 సంవత్సరాల వయస్సులో అస్తమించారు. టాంక్విలో మరియు ఎలిసా క్లివియో పుణ్య దంపతుల ముద్దు బిడ్డడై ఆయన 1915, డిశంబరు 20న ఇటలీలోని వరేసేలో ఓరినో అనే స్థలంలో జన్మించారు. 1928లో ఆయన గురు విద్యాలయంలో చేరి, నాలుగేండ్ల తదుపరి, ఒక మిషనరీగా భారత దేశానికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. తన నొవిషియేట్ విద్యాభ్యాసం 1933 డిశంబరు 7న షిల్లాంగ్ వద్ద ఆరంభించాడు. ఆ మీదట సలేషియన్‌గా తన మొదటి ప్రమాణ స్వీకరణ చేశాడు. అతని యోగ్యత శ్రద్ధల వల్ల 1937లో పశ్చిమ బెంగాల్ నందలి క్రిష్ణగర్ మేత్రాసన పీఠాధిపతులకు కార్యదర్శిగా నియమింపబడ్డాడు. రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభమైన తొలినాళ్ళు అవి. ఆ నేపథ్యంలో యితడు చెరసాలలో పెట్టబడి, రక్షణార్థము శిక్షణ పొందే శిబిరములో చేర్చబడి 'డెయోలి' నగరంలో ఉన్నాడు. ఆ మీదట డెహ్రాడూన్‌కు మార్చబడ్డాడు. 1944, డిశంబరు 8న గురుపట్టాభిషేకము పొందాడు.

ఫాదర్ జియుసెప్పె మోజాగారు, విదేశీ మిషనెరీలలో అత్యుత్తమ ఆదర్శప్రాయుడు, దుఃఖోపశమనం కల్గించడంలో శిఖామణితుల్యుడు. తన ఇటాలియా జాతి లక్షణాన్ని ఏనాడూ అతడు విడనాడ లేదు; చీజ్‌ను, వైన్‌నూ, మంచి ఆహారాన్ని యిష్టపడ్డాడు. భారతీయతకు సంబంధించిన ప్రతి వొక్క విషయాన్నీ ఏమంత సంపూర్ణంగానూ, హృదయపూర్వకంగాను అతడంగీకరించలేదు.

1946లో అతడు విడుదల పొంది, గోవాకు వెళ్ళి అభిలషించాడు. అక్కడ దీర్ఘానుభవం గల ఒక సలేషియన్ మిషనెరీ, ఫాదర్ స్కుదేరి గారి సాహచర్యంలో అతడు 1962 నుండి 1977 వరకు పని చేశాడు. అక్కడ 'సుల్కోర్ణా' అనే ఒక విస్తారమైన అడవిని, ఆటవిక సమాజాన్ని ఆయన బాధ్యతకు అప్పగించడం జరిగింది. గోవాలోని ఆ భాగాన్ని ఒక వికసించిన సమాజముగా, వ్యావసాయక కార్య కేంద్ర స్థానముగా ఆయన మార్చివేశాడు. గోవానుండి లోనావ్లా, పూనా, వరకు వెళ్ళి ఆ తర్వాత ముంబైకి చెందిన ఆంటోప్ హిల్ వరకు ఆయన పురోగమనం చేశాడు. 1988లో 'డాన్‌బోస్కో మడోన్నా' పత్రికకు సంపాదకుడుగా నియమింపబడ్డాడు. ఆ పదవిలో 20 సంవత్సరాల పాటు ఆయన సేవచేస్తూ, తానున్న స్థలానికి ప్రొవిన్షియల్ నిలయంగా మార్పించుకున్నాడు.

ఫాదర్ మోజాగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. భాషా నిపుణుడు, సంపాదక పాత్రికేయుడు, సంగీత విధ్వాంసుడు, సువార్త బోధకుడు, రచయిత, యింకా ఎటువంటి మానవ వర్గీకరణను, నిర్వచనమును అంగీకరింపని సమాజ నిర్మాత, వేటగాడు కూడా. వెను దిరిగి చూచుకుంటే, అతడు తన 'తండ్రియైన డాన్‌బోస్కోగారిని అమితముగా ప్రేమించిన మహాగొప్ప సలేషియన్ అని, ఎవరిని అడిగినా తడుముకోకుండా జవాబిస్తారు. డాన్‌బోస్కోగారి జీవిత చరిత్ర అనే గ్రంథాన్ని 'టెరెసియో బోస్కో'గారి నూతన 'స్వీయ రచన'ను అనువదిస్తూ తన కడపటి సంవత్సరాలను గడిపాడు. యిది, ఆయన ప్రేమతో పరిశ్రమించిన కార్యము. "ఈ వాస్తవాలు, ఈ విశేషాలు యివన్నీ నేనెరిగినవే" అంటాడాయన. ఫాదర్ ఇవో చేళోగారితో ముచ్చటిస్తూ, 'కాని ఎన్నోసార్లు నేను కొనసాగించ లేకపోయాను, కన్నీళ్ళ పర్యంతము కదిలిపోయాను'అన్నాడు. ఫాదర్ మోజాగారు మనకోసం ఏదైనా మిగిల్చారా అంటే అది, డాన్‌బోస్కోగారి పట్ల ఆయనకుండిన గొప్ప ప్రేమాభిమానమే ఆదర్శముగా, స్ఫూర్తి మంతముగా మనకు మిగిల్చారు అని అనుటలో ఆశ్చర్యం లేదు. ఆ ప్రేమ విషయిక స్ఫూర్తిని, ఆదర్శాన్ని మన సలేషియన్ సభలో మనకొరకు ఆయన వారసత్వ సంపదగా మిగిల్చారని మనం చెప్పుకోవచ్చు. ❀



# సిలువ దిగిన వీరుడు

సిస్టర్ విజయశాంతి, ఎం.ఎస్.ఐ.
ఎస్.హెచ్. కాన్వెంట్, గుడివాడ

న్యాయ పీఠంపై నాలుక కరచుకొని కూర్చున్న ఓ చక్రవర్తి, నేరమేంటో తెలియక రాత్రంతా అటు ఇటు త్రిప్పించాడు. పిలాతు పిరికివాడై ప్రజలకు లొంగిపోయాడు. చేతులు కడుక్కుంటూ "ఈ నీతిమంతుని రక్తంతో నాకు సంబంధం లేదని ఇతనిని మీరే తీసుకొనిపోయి సిలువ వేయండి'' (మత్తయి 27:24) అంటూ రాక్షస మూకకు రక్షకుడిని అప్పగించాడు. కొరడాలతో కొట్టినపుడు శరీరమంతా తుపాకి గుండ్ల తూట్లకు బలియైపోయింది. ముళ్ళతో కిరీటం పెట్టి మోదినప్పుడు వారంతా రక్తసిక్తమైన కనికరంలేని కాకుల్లా పొడుచుకు తిన్నారు. కరుణగల రక్షకునికి కన్నీరే తోడుగా మౌన ముద్ర దాల్చినప్పుడు మోముపై ఉమ్మివేసి హేళన చేశారు. సిలువ సింహాసనంను ఆ భుజస్కంధాలపై అధిష్టించి అధికారం చెలాయించారు రక్కసిమూక. ఊరినే వెలివేసినట్లు ఊరిమధ్య నుండి మోయలేని మ్రానుతో నడిపిస్తుంటే, అద్భుతాలు ఆనందంతో చూసిన వారే అయ్యో! అనలేక నిమ్మకు నీరెత్తినట్లు వున్నారు. పంట పొలాల్లో, కొండవాగుల్లో, ముళ్ళ తుప్పల్లో పద్మంలాంటి పావనుని పాదాలు రక్తసిక్తమై తడిసి ముద్దయై తడబడు నడకలతో సిలువమోస్తూ అందరి పాపాలను కల్వరిగిరికి చేర్చారు. గొల్గొత్తాపై సిలువ మరణపు కేకతో పట్టపగలు చీకటి క్రమ్మింది. సూర్యుడే సింధూరపు ఎరుపుమయమై దేవాలయపు తెర నడిమికి చిరిగింది. గాలి తుఫాను దుమారం రేకెత్తించాయి. పెను తుఫాను ఉధృతమైంది. పక్షులు, జంతువులు, "ఏమిటి ప్రకృతి వైపరీత్యం?'' అని ప్రశ్నించాయి. కొండకోనలు హోరుమని నినాదాలు చేశాయి. గలగల పారే సెలయేర్లు, కల్వరికి చేరాయి. మానవ జాతి అంతాకూడా ముఖం కప్పుకుంది. అప్పుడే సిలువ మీద నుండి పలికిన సప్త పదాలు విశ్వానికి వినిపించాయి.

"తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు వీరిని
క్షమించండి'' (లూకా 23:34).
"అంతా సమాప్తమైనది'' (యోహాను 19:30).
అంటూ భూగర్భంలో నిద్రించాడు లోక రక్షకుడైన
సిలువనాథుడు.
మూడవనాడు మరణపు ముల్లు విరిచినాడు
శిలువ దిగిన వీరుడు.
సమాధి సంకెళ్ళు త్రెంచినాడు - శిలువ దిగిన వీరుడు
మృత్యుంజయుడై లేచినాడు - శిలువ దిగిన వీరుడు.

❋

# స్వకీయ దివ్య దర్శనాలు - కాల సూచన్లు

సిస్టర్ జొహాన్నా బ్రండ్‌స్టేటర్

మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న ఆ రోజుల్లో అసాధారణమైన 'మేల్కో'మనే పిలుపు పరలోకం నుండి వచ్చింది; గొర్రెల్ని మేపుకొంటున్న ముగ్గురు రైతుబిడ్డలైన బాలలకు పరిశుద్ధ మరియమాత దర్శనమిచ్చారు. ఫాతిమాలో 1917 అక్టోబరు 13న 'సూర్య గోళపు' మహాద్భుతం జరిగింది. సుమారు 60,000 మంది ప్రజలు దానిని కళ్ళజూచారు. కుండపోతగా కురుస్తున్న వర్షంలో అది అగుపడింది. ఫాతిమా నగరానికి 30 కిలోమీటర్ల వ్యాసార్థంలో యిదే దృశ్యం మరొకచోట కూడా చోటు చేసుకున్నది.

ఫాతిమా నగరంలో జరిగిన 'సూర్యగోళ మహాద్భుతము' అపోస్తుళ్ళ కాలం తదనంతరం జరిగిన మిక్కిలి గొప్ప అద్భుతమని చెప్పబడుతోంది. ఐనప్పటికీ చాలా కొద్దిమంది కతోలికులకు మాత్రమే ఈ సత్యము తెలియజేయబడి వుంది. ఈ చారిత్రిక సంఘటన కేవలం, ఒక ప్రైవేటు దివ్యదర్శనంగా మాత్రమే పరిగణింపబడుతుంది. జగద్గురువులైన రెండవ జాన్‌పాల్ పాపుగారు ఆ సంఘటననీ మరింకా ఫాతిమా సందేశాలను కూడా విశ్వసించియున్నారు.

మిక్కిలి ముఖ్యమైన మరియమాత దివ్య దర్శనం, ఫాతిమా తదుపరి మెడ్జుగోర్జె వద్ద కలిగింది. 1987లో నా మఠవాస సభ సెలవు దినాల్లో నేనొక యాత్రికుల గుంపుతోచేరి, ఆస్ట్రియా నుండి మెడ్జుగోర్జె వెళ్ళడానికి బయల్దేరాను. మెడ్జుగోర్జెలో నేను గడిపిన రెండు రోజుల్లో నాకు కలిగిన పరలోకపు అనుభవం ఎటువంటిది అంటే, అక్కడ ధన్యమాత యొక్క సాన్నిధ్యం ఉందనడంలో ఏపాటి సందేహం అసలెప్పటికీ నాకు కలగదు. 'ఆ పుణ్యక్షేత్రాన్ని వదలిపెట్టి వెళ్ళాల్సిన సమయం రాగా, నేను ఆ దేవాలయం వెనక్కు వెళ్ళి వీడ్కోలు తెల్పుకుంటూ నేను దుఃఖంలో ఏడ్చానంటే నమ్మండి! 23 ఏండ్ల క్రితం, ఒక్క అమెరికాకు చెందిన యాత్రికులే యాభైవేల కోట్ల మంది మరి తదితరులు పొరుగు దేశాల యాత్రికులే! అక్కడి పచ్చిక మైదానమంతట ఆ దేవాలయం చుట్టూ పాప సంకీర్తన కుర్చీలున్నాయి. ఇప్పుడు మెడ్జుగోర్జె అనేది ప్రపంచపు పాప సంకీర్తన కేంద్రమని పిలువబడుతూవుంది.

అనేక మంది పీఠాధిపతులతో, 2వ జాన్‌పాల్ పాపుగారు, అక్కడకు వెళ్ళి ప్రార్థన చెయ్యండని చెప్పినట్టు నివేదికలు తెల్పుతున్నాయి. ప్రస్తుత 16వ బెనెడిక్టు జగద్గురువులు ఆనాడు కార్డినల్ రాట్జింగర్ గారు ఏమన్నారంటే, "శ్రీసభ చరిత్రలో యేనాడూ యింతగా పరలోకపు జోక్యాన్ని ప్రజలు పొంది వుండలేదు." ఆయన సత్యోపదేశపు ముఖ్య గ్రంథకర్త - శ్రీసభ కంతటికీ, సారాంశ సంగ్రహ వ్యాఖ్యలో ఆయన యిలా పేర్కొన్నారు. ప్రైవేటు దివ్య దర్శనాల మూల్యం. విశ్వాసపు నిక్షేపానికి చెందకున్నా, స్వకీయ దివ్య దర్శనాలు, మనని క్రీస్తు చెంతకు నడుపుతున్నంత సేపూ వ్యక్తిని విశ్వాస జీవితం గడప తోడ్పడగలవు. శ్రీసభ అధికార గణం, స్వకీయ దివ్య దర్శనాలను సమీక్షించే బాధ్యత కలిగి, క్రీస్తే నిశ్చయమైన దివ్యదర్శనం ఐనందున, క్రీస్తును మించిపోయే, క్రీస్తును సరిదిద్దే ప్రైవేటు దివ్య దర్శనాలను ఆమోదించ జాలదని వ్యాఖ్యానించారు.

విశ్వవ్యాప్తంగా ఆధ్యాత్మిక ఫలాలు, మరి అత్యంత ముఖ్యమైన ఫాతిమా వంటి విశాలతలు 1981 మొదలుకొని, జగమెరిగిన సత్యమై అందరికీ కనబడుతున్నాయి. అమితమైన శాంత స్వభావం, అనంత సౌజన్యత, అపార ప్రేమను కలిగి మరియమాత, తన బిడ్డలందరినీ పరివర్తనకు పిలుస్తోంది. ఆ ప్రభువు సహవాసంలో అమితానంద జీవితానికి ఆమె రమ్మంటుంది.

కార్ల్ రోహ్నెర్ చెపుతున్నట్టు, "స్వకీయ దివ్య దర్శనాలు, వాటి సారాంశంలో ఆజ్ఞార్థకమైనవి. నిర్దిష్టమైన చారిత్రిక పరిస్థితుల్లో విశ్వాసులైన క్రైస్తవ ప్రజలు ఏలాగు చర్య తీసుకోవాలో సూచిస్తున్నాయి, ఈ ప్రైవేటు (స్వకీయ) దివ్యదర్శనాలు. అవి క్రొత్త వాంగ్మూలాలు కాదు, కానీ క్రొత్త ఆజ్ఞార్థకాలు." విశ్వాసంలో బలమైనవారు, దైవవాక్కును, తెలియజేయబడిన విశ్వాస సత్యమును, నమ్మకస్థులుగా

జీవిస్తున్నవారు అందరూ ఈ ప్రత్యేక స్వకీయ హెచ్చరికల్ని పట్టించుకోవలసిన అవసరం ఉండదు. ఐనా సత్యాన్వేషకులకు యివి అత్యంత ప్రాముఖ్యం గలవి. విశ్వాసాన్ని విసర్జించుకొన్న వారికి, అవిశ్వాసులకు, మరి ఎంతో మందికి ఈ శక్తివంతమైన హెచ్చరిక అవసరమే. ప్రస్తుత కాలంలో విశ్వవ్యాప్తంగా విస్మరింపబడుతున్నా, కొన్ని ఆవిష్కరింపబడిన సత్యాలను విశ్వసింపాల్సిన అవసరాన్ని ఈ దివ్య దర్శనాలు నొక్కిచెప్తున్నాయి.

కార్డినల్ క్రిస్టోఫ్ స్కోన్‌బోర్న్ వియెన్నాగారు 2009 డిశంబరు 31న మెడ్జుగోర్జెను సందర్శించారు. ఆ సంఘటనల, కాదనరాని ఆధ్యాత్మిక ఫలాలను గురించి స్కోన్‌బోర్న్‌గారు ప్రసంగించారు. ఏ సహజ వివరణనయినా సవాలు చేసే సంఘటనలు అక్కడ చోటు చేసుకొని ఉన్నావేమోనని వారనుకొన్నారు.

మెడ్జుగోర్జె విషయంలో తన ఆసక్తి, 1980కి మునుపటి నాటిదని గుర్తుచేసుకొంటూ, కార్డినల్ స్కోన్‌బోర్న్‌గారు ఒక ఆస్ట్రియా క్యాతలిక్ వార్తా పత్రికకు చెప్పిన విషయం ఏమిటంటే "నిర్వచింపబడిన తాను శ్రీసభ తీర్మానాన్ని ముందుగా ప్రస్తావించకుండా, నేను వాంగ్మూలం యిస్తున్నాను, 1981 మొదలుకొని మెడ్జుగోర్జెలో దర్శనమిచ్చిన సంఘటనలు, యితర చోట్ల, మరియమాత దివ్య దర్శనాలు కలిగిన సంఘటనలతో సారూప్యతను బలంగా కలిగి వున్నాయి."

మెడ్జుగోర్జె సందేశాలుగా చెప్పబడేవి అక్కడ జరుగుతున్న ప్రార్థనలంత ప్రాముఖ్యతగలవేమీ కాదని కార్డినల్‌గారన్నారు. "మెడ్జుగోర్జెలోనికి ఒక కృపావాహిని ప్రవహిస్తుందంటే సందేహిస్తున్నవారు, కళ్ళు మూసుకొని, ఆ మెడ్జుగోర్జెను, లూర్దుమాత దివ్య క్షేత్రంతో పోల్చుకొని చూడాలి - హృదయాల పరివర్తన జరిగేచోటు ఎలాంటిదో స్మరించుకోవాల"న్నారు.

"దేవమాత వలన ఎవరయినా నేర్చుకోవాల్సిన గుణపాఠం ఏమై ఉంటుంది? దైనందిన జీవితంలో విశ్వాసం! నా మట్టుకు నాకైతే, మెడ్జుగోర్జె అనేది, సాధారణ క్రైస్తవ జీవిత పాఠశాల అని నేను చెప్పగలను" అన్నారాయన.

16వ బెనెడిక్టు పాపుగారితో కార్డినల్ వియెన్నా గారి సాన్నిహిత్యం జగమెరిగిన సత్యం. వేనవేలాది కతోలికులకిది చాలు, దశాబ్దాల తరబడి రోము, మెడ్జుగోర్జె దివ్య దర్శనాలను అధికారికంగా గుర్తించి ఉందని నమ్మడానికి, గొప్పగా ఆశించడానికి కూడా ఆ వేనవేల కతోలికులలో నేనూ ఒకదానను.

**నవ్వు నవ్వులే!!!**

- ఏమండీ! ఈ రోజు మన పనిమనిషి కట్టిన చీర ఎంత బాగుందో అన్నది భార్య. మన సెలెక్షన్ గొప్పతనం ఇప్పటికి అర్థమయిందన్నమాట...అన్నాడు భర్త.
- టికెట్ లేకుండా రైలు ఎందుకెక్కావయ్యా? బస్సులో ఇచ్చినట్లే లోపల ఇస్తారనుకున్నా సార్
- నేను ఆపరేషన్ చేయించుకున్నాను. నీవు గర్భవతి వయ్యావ్! కోపంగా అడిగాడు భర్త.
  మీరు నన్ను మోసం చేశారు. ఆపరేషన్ చేయించు కున్నట్టు నాకు చెప్పలేదుగా.. మరింత కోపంగా అందా భార్యామణి.
- ఫోటో స్టూడియోలో కొన్ని ఫోటోలు వెలుపల పెడ్తారెందుకు? వారు డబ్బులు ఇవ్వని వారని అర్థం.
- తాగుబోతువాని ప్రత్యేకత ఏమి? ఎవరి సొమ్ముతో తాగుతాడో వారినే తిట్టడం.
- ఆంధ్రుల ప్రత్యేకత ఏమిటి? రూపాయిన్నర పెట్టి సిగరెట్టు కొనుక్కొని పక్కవాణ్ణి అగ్గిపెట్టె అడగడం.
- బాగా తాగి అర్థరాత్రి వచ్చి తలుపు తట్టాడు భర్త. తాగి వచ్చినా భార్య తలుపు తీసింది. మా ఇల్లు అనుకుని వచ్చా. ఏమీ అనుకోవద్దమ్మా అని మళ్ళీ బజారున పడ్డాడు.
- నాకు దూరదర్శన్‌లో ఉద్యోగం వచ్చింది. నన్ను ఆశీర్వదించండి సార్! లక్షలాది మంది ప్రేక్షకుల ఉసురుపోసుకున్నా కూడా నువ్వు క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నానోయ్.
- నిజమైన పతివ్రత అంటే ఎవరు? భర్తను అప్పడాల కర్రతో కొట్టేముందు - మంగళ సూత్రాన్ని కళ్ళకు అద్దుకొనే భార్య.



అతడు చదువుకున్నది 8వ తరగతే, ఐనా సూక్ష్మస్థాయి వ్యాపారం నడుపుతున్నాడు. చిన్న పిల్లల కోసం ఓ పత్రికను కూడా చేపట్టాడు.

# బడికి మానుకున్న బాలుడు...

## పత్రికా సంపాదకుడైన విచిత్రం

రచన : **వర్గీస్ అలెంగాడెన్**

విన్‌చే 8వ తరగతిలో బడికి మానుకోక తప్పలేదు. పరిస్థితి తండ్రికి ప్రమాదం జరిగి, మరెంత మాత్రం పనికి పోలేకపోవడం, తాను జ్యేష్ట పుత్రుడైయుండి, కుటుంబాన్ని పోషించే బాధ్యతను మీద వేసుకోవడం, తప్పనిసరై బాల్యావస్థలో బేల్దారి పనిలో కూలిగా చేరాడు. క్రమేణా తన సృజనాత్మక శక్తితో అగర్ బత్తీలను తయారుచేస్తూ, కుటుంబ పోషణకు అవసరమైన మేరకు ఉపాధిని సమకూర్చుకోవడం నేర్చుకున్నాడు. పరిసరాలలోని చిన్న అంగళ్ళకు, యితర గృహాలకు అగరుబత్తీలను సరఫరా చేసేవాడు. తన ఈ చిన్న వ్యాపారాన్ని వైవిధ్య భరితంగా కూడా మార్చుకొని, పేద మహిళల చేత జపమాలల్ని తయారు చేయించి, వారికి ఉపాధిని చూపడమేగాక, వేరు వేరు దుకాణాల్లో, దేవాలయ షాపుల్లోనూ వీటిని విక్రయించ సాగాడు. ఇంటింటికీ తిరిగి పెద్ద రొయ్య చేపలను కూడా విక్రయించాడు. కష్టపడుతూ తన కొద్దిపాటి వ్యాపారంలో విజయాన్ని చవిచూచాడు. ఐతే, ఈ సూక్ష్మస్థాయిలో తన వ్యాపారాన్ని నిలిపేయదలచుకోలేదతడు. ఈ గ్రామంలోనే అందరికంటే అధిక సంపన్నుడు కావాలనే ఆకాంక్షించాడు. కష్టపడి పరిశ్రమిస్తూ ఆటు పోటులకు తట్టుకో గలుగుతున్నాడు.

విన్‌చె, కేరళలోని కొడుంగలూరు సమీపంలో ఒక చిన్న గ్రామస్థుడు, గణనీయంగా, పాత్రికేయం విషయిక సృజన శక్తితో గుర్తింపు తెచ్చుకున్నాడు. బడి చదివే రోజుల్లో కథానికలు చెప్పడంలో నిపుణుడు. చిన్న పిల్లలకోసం కథలను సేకరించి, వాటిని ఒక పుస్తకం రూపంలో ప్రచురించాలని కలలుగన్నాడు. స్థానికులైన కొందరు ప్రచురణ కర్తలను సంప్రదించాడు. పేదయింటి బాలుడు, బడికి మానుకొన్న విద్యార్థి కావడం చేత యితణ్ణెవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఆ సమయంలో ఒక శ్రేయోభిలాషి, సాంఘిక కార్యకర్త యితనికి ఓ సలహాఇచ్చి సొంతంగా ఒక చిన్న పత్రికను ప్రారంభించమన్నాడు.

ఆ విధంగా "కుట్టి పత్రం" అనే చిన్నవార్తా పత్రికను 2008 మార్చి నెలలో ప్రారంభించాడు. తానే ప్రచురణకర్త, తానే సంపాదకుడు మరియు తానే పంపిణీకర్త. 'సంపాదకీయం' తానే స్వతహాగా రాసేవాడు. తన కథానికలతో పాటు, పరిసర పాఠశాలల్లోని బడిపిల్లలు వ్రాసే చిన్న చిన్న వ్యాసాలను కూడా సేకరించుకొని తన "కుట్టిపత్రం"లో ప్రచురించ సాగాడు. అతని ప్రయత్నాలను కొందరు దుకాణదారులు ప్రోత్సహించారు. తమ వ్యాపార ప్రకటనలను దానిలో

ప్రచురింపకోరేవారు. ఈ యువ సంపాదకుడు తన సంచికల్ని విక్రయించడానికి వేరు వేరు పాఠశాలలకు వెళ్ళేవాడు. పలు విద్యా సంస్థల అధినేతల అభిమానాన్ని పొందగలిగాడు. వాళ్ళతని పత్రికల కోసం ఆర్డర్లు యివ్వసాగారు. అతని కోసం బడి పంతుళ్ళు, చందాలను, కథానికలను సేకరించి పెట్టి సహాయం చేశారు. "కుట్టిపత్రం'' సంచికను రు. 2.50/- లకు విక్రయించేవాడు. 1500 ప్రతుల వరకు విక్రయిస్తూ ఒకదాని నుండి మరోదానికి చొప్పున అనేక పాఠశాలల్ని సందర్శిస్తూ వెళ్ళేవాడు.

విన్‌చే చేస్తున్న వినమ్ర ప్రయత్నాలకు, అధ్యాపకుల ఆలంబన, విద్యార్థుల తోడ్పాట్లు చాలా లభించాయి. విద్యార్థులు పత్రిక కోసం ఎదురు చూపులు చూడసాగారు, తాము వ్రాసిన వ్యాసాలు ప్రచురణకు నోచుకున్న వాటిని చదువుకోవడానికి సంచిక కోసం వాళ్ళెదురు చూచారు. బడి పిల్లలు వ్రాసిన వ్యాసాలు అతనికి చేతినిండా లభించినాయి. తానే వాటిలోనుండి ఎంపికచేస్తూ, సరిదిద్దుతూ, పత్రికను రూపుతీర్చేవాడు. కొందరు పిల్లలు పంపే వ్యాసాల్లో కాపీచేసిన వాటిని అతడు కనుగొనేవాడు, అట్టి కాపీచేసిన వాటిని నిరాకరించేవాడు. మంచి వ్యాసాలను కథానికలను వ్రాసే విద్యార్థులకతడు చిన్న చిన్న బహుమతులను యిస్తూ వ్రాసేవారిని ప్రోత్సహించి, తన పత్రికా వ్యాపారాన్ని సజీవంగా నిలబెట్టుకొంటుండేవాడు. అతడు స్వతహాగా ఆయా పాఠశాలలకు వెళ్ళి ఈ పారితోషికాలందించేవాడు.

వ్యాసాలను, కథానికలను సరిదిద్దడం, పత్రికని ముద్రించడం, పాఠకులకు పంపిణీ చేయడంతో పాటు విన్‌చే, తన యితర సూక్ష్మ వ్యాపారం కూడా నిర్వహించేవాడు. దినమంతా కసరత్తుగా పనికలిగి యింటింటికీ తిరిగి వివిధ ఉత్పత్తులను, రొయ్యలను, చేపలను, పార్శిళ్ళను, జపమాలల్ని, అగరుబత్తీలను అందిస్తూ వెళ్ళేవాడు. పలు దుకాణదారులను సందర్శిస్తూ వారి వారి వ్యాపార ప్రకటనల్ని సేకరించుకొనేవాడు. ఈ వ్యాపార ప్రకటనలతోనే తన పత్రిక ప్రచురణకయ్యే ఖర్చంతా రావడం తనకు సంతోషదాయకంగా ఉండేది.

విన్‌చే, తను ప్రచురించే పత్రికకు పాఠకుల సంఖ్యను పెంపొందించుకోవాలని కలలుగన్నాడు. తన పత్రిక భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని దానిని రిజిస్ట్రేషన్ చేయించాడు, లైసెన్సునూ పొందాడు. ఈ లైసెన్స్ ద్వారా అతనికి అనేక ఉపయోగాలుంటాయి. పెద్ద పత్రికల వారికి లభించే ప్రయోజనాలను తానూ పొందగలడు. రిజిస్టరు చేయబడిన పత్రిక ప్రచురణల విధులు బాధ్యతలు కూడా యితనికి తెలుసు. ఇతర పెద్ద పత్రికలకు సాటిగా తన పత్రికను వార పత్రికగా మల్చుకోవాలని కలలుగన్నాడు. కేరళలో పెద్ద యెత్తున ప్రచురింపబడే 'బలరామ్' పత్రిక గురించి వ్యాఖ్యానిస్తూ, "ఆ సంచిక ఖరీదు పది రూపాయలు, కానీ నా ప్రతి రూ. 2.50 పై. లు మాత్రమే'' అన్నాడు. అతని స్వరంలో ఆత్మ విశ్వాసం, దృఢ నిర్ణయం ధ్వనించింది.

విన్‌చే ప్రయత్నాల్లో ప్రత్యేకత యేమిటంటే, యిదంతా అతని సొంత ప్రయాసతోనే ఆరంభించాడు. యే ఉపకారిని ఆశ్రయించకుండా, చిన్న పెట్టుబడి పెట్టుకొని వినమ్రంగా ఆరంభించాడు. ప్రూఫులను చదివి అక్షరదోషాలను సరిదిద్దిన ఓఎస్‌జె సెమినరీకి చెందిన ఫాదర్ ప్రిన్స్ గారికి తానెంతో రుణపడి ఉన్నానని చెప్పుకొన్నాడు. తన వినమ్రత, మంచి గుణగణాల వల్ల అందరి ప్రోత్సాహాన్ని యితడు పొందగలిగాడు. విన్‌చె యొక్క సృజనశక్తి తన తమ్ముడిపై ప్రభావం చూపించింది. ఒక ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూనే తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నాడు. ఐ.ఏ.ఎస్. ఆఫీసర్ కావాలని తమ్ముని ఆకాంక్ష.

మన సభ్య సమాజంలో ఎంతమంది విద్యార్థులు, అన్ని సౌకర్యాలున్న ఈ పాఠశాలల్లో తమ 10 శాతం శక్తి సామర్థ్యాలను అటువంటి సృజనాత్మక శక్తికోసం వినియోగించగలరు? ఎందరు ఉపాధ్యాయులు, అధ్యాపకులు అటువంటి భావి గాంధీలను, ఠాగూర్‌లను, ఆమ్టేలను, టాటాలను తమ తరగతి గదులలో గుర్తిస్తున్నారు? వారి కలలను పండించేందుకు వారిని ప్రోత్సహిస్తున్నారా?

*Courtesy : Indian Currents*



# యాజకుడు అంటే ఎవరు?

ఫా. మైకెల్ అమలదాసు, ఎస్.జె., చెన్నై

యాజకుల కొరకు ప్రార్థనలు చేస్తూ, గురువుల నిమిత్తం అంకితం చేయబడిన సంవత్సరం మధ్యలో మనం జీవిస్తున్నాం. గురువులంటే ఎవరు? వారేమి చేయవలసి వున్నారనే విషయాలను వివరించే వ్యాసాలు గురువులకు మనకు వివరంగా చెప్పే సాహిత్యాన్ని పత్రికలు ప్రచురించాయి. దివ్య పూజాబలిని సమర్పిస్తున్న వారు, మన పాపాలకు క్షమాపణని యిప్పిస్తున్నవారు గురువులేనని మనకు తెలుసు. మరి గురువు అంటే ఎవరు? అని ప్రశ్నించడమెందుకు? 'గురువు' అనేమాట అస్పష్టమైన అర్థాన్నిస్తుంది. మరింత విశదమైన అవగాహన మనకు అనేక విధాలా సహకరించగలదు. సాధారణ ప్రజలైన మనం 'గురువు'ల కొరకు ప్రత్యేకంగా ప్రార్థనలు చేస్తున్న ఈ తరుణంలో 'గురువు' యొక్క అర్థం తెలుసుకోవాల్సిన అవసరం వుంది.

అన్ని మతాల్లో 'అర్చకుడు' మతాచరణకు సంబంధించిన వ్యక్తిగా చెప్పబడుతున్నాడు. ఒక ఆచార్యుడు దేవుని అర్పణలు సమర్పిస్తాడు. పాత నిబంధన గ్రంథంలో మొత్తం యాజకుల తెగ, కులం, వంశాన్ని గురించి మనం చదువుతున్నాము. వారిలో ముఖ్యుడొకడుంటాడు, 'ప్రధమ ఆచార్యుడు'గా ఆయా నిర్దిష్ట దినాలలో విశేషాధిక్యత వహించే పెద్ద గురువు ఒకరుంటారు. ఈనాటి కతోలిక గురువులు కూడా, పరిశుద్ధ దైవార్చనా కాండను నిర్వహిస్తున్నారు. అందు ప్రజలు సహకరిస్తున్నారు. పవిత్ర దివ్యపూజా బలిని 'వింటున్న ప్రజలుగా, చూస్తున్న ప్రజలుగా కూడా చెప్పుకొంటున్నాము. విషయాలను మనం ఈ దృక్పథంతో చూడటం సరికాదు.

కొత్త నిబంధన గ్రంథంలో యాజకుడు అనే పదం, మనం గురువులు అని చెపుతున్న వారికి అన్వయించేది కాదు. హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక, యేసును యాజకుడుగా చెపుతుంది. కాని యేసు జంతువులను అర్పణలుగా సమర్పించడు. పాత నిబంధన కాలపు అర్చకులు చేసినట్టు 'దహన బలు'లను సమర్పించలేదు యేసు. అయితే అందుకు బదులుగా యేసు సమర్పణంతా పరమ తండ్రి చిత్తమునకు విధేయించడం. తరచుగా మనం తలంచేదేమిటంటే - యేసు తనను తాను బలిగా సమర్పించారని, తన స్వీయ రక్తాన్ని చిలికించారని అనుకొంటుంటాం. నిజంగా యేసు తనను తాను చంపుకోవడం లేదు. ఆయన సమర్పణంతా తనను తాను పరిపూర్ణంగా తండ్రి దేవునికి లోబరచుకొన్న స్వీయ దానము. హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక ఏమి చెపుతుందంటే - "క్రీస్తు ఈ లోకంలోనికి వచ్చినప్పుడు, అతడన్నాడు, 'బలులను అర్పణలను నీవు కోరవు, కాని నాకొక శరీరాన్ని ఏర్పరచితివి; హోమములు, పాపపరిహార బలులతో

నీవు సంతృప్తి చెందవు. అప్పుడు నేను యిట్లంటిని, "ఓ దేవా, నీ అభీష్టం నెరవేర్చడానికి, యిదిగో నేను వచ్చియున్నాను, ఓ దేవా'' (హెబ్రీ 10:5-7).

పునీత పేతురుగారు వ్రాసిన మొదటి పత్రిక, ప్రతి క్రైస్తవ విశ్వాసిని ఒక గురువని పిలుస్తుంది. ఆయన క్రైస్తవులను ఉద్దేశించి : "మీరు ఎన్నుకొనబడిన జాతి ఓరాచరికపు గురుకులము. పవిత్రమైన జనము; దేవుని సొంత ప్రజలు. దేవుని అద్భుత కార్యములను ప్రకటింప ఏర్పరుపబడినవారు. ఆయనయే మిమ్ము చీకటినుండి అద్భుతమగు తన వెలుగులోనికి పిలిచెను'' అని చెపుతున్నాడు (1పేతురు 2:9). ఇక్కడ గమనించదగిన విషయం ఏమిటంటే దేవుని మహత్కార్యాలను గురించిన ప్రకటన యిక్కడ కనబడుతుంది, కాని 'బలి' అనే పదం ఉపయోగించలేదు. ఈనాడు మనం చెప్పబోతున్నది యేమిటంటే; క్రీస్తు, శిరస్సు శరీరము సహితము సమర్పించే దైవార్చన. ప్రజలు ఆయన శరీరము. వారు, యేసు క్రీస్తుతో చేరి ఆ దైవార్చనను నిర్వహిస్తున్నారు.

ఈ ప్రణాళికలో 'గురువులు'గ పిలువబడుతున్న ప్రజలు ఎక్కడ ఉన్నారు? అర్పణలు సమర్పించే సంఘాన్ని వాళ్ళు ముందుకు నడిపిస్తున్నారు. సంఘంతో చేరి, సంఘము పేరిట వారు ప్రార్థనలు చేస్తున్నారు. సంఘానికి శిరస్సుయైన యేసు క్రీస్తుకే మరి సాంకేతికమైన గురువులున్నారు. క్రీస్తే గురువు ద్వారా, సంఘంతో చేరి, స్వయం సమర్పణను నెరవేర్చుతున్నారు. అయితే, అంతకు మించిన యోగ్యత, సామర్థ్యం లేకుండా వారిని 'గురువులు' అని పిలవడం, దేవుని ప్రజల యాజకత్వాన్ని మనం కించపరచినట్లవుతుంది.

నిజానికి ద్వితీయ వాటికన్ మహాసభ, ఈ విషయములో ఒక విధమైన విప్లవాన్ని తెచ్చింది. మనం శ్రీసభను గురించి మాట్లాడేటప్పుడు, తక్షణం మనం యాజక వర్గాన్ని గురించే తలంచుకుంటాం. వాళ్ళే శ్రీ సభలో పాత్రధారులుగా కనబడుతున్నారు. ప్రజలు వట్టి లబ్దిదారులుగా మాత్రమే చూడబడుతున్నారు. ఈ రెండవ వాటికన్ మహాసభ దీనికి భిన్నంగా చెప్పిందేమిటంటే శ్రీసభ అనేది ప్రాథమికంగా దైవ ప్రజల సంఘమే. ఆచార్యులు, విశ్వాసుల సంఘంలోనివారే. కాని, ఆచార్య వర్గము ఆధిపత్యం కలిగిన భాగం ఏమీకాదు. వారు సేవకులు అంటే ప్రజల పరిచారకులు, దేవుని ప్రజల సేవకులు. వారి పరిచర్యను నిర్వచించాలి. మనమిక్కడ వింటున్న పేతురు గారి ఉద్ఘోషణలు : 'దేవుని సొంత ప్రజలు.

రెండవ వాటికన్ మహాసభ తెచ్చిన విప్లవంలోని రెండవ అంశం ఏమిటంటే, పదాల తికమక అర్థాలను నివారించే నిమిత్తం, సాధారణంగా గురువులని పిలువబడేవారిని ప్రెస్బిటర్స్ అని కొత్త ప్రస్తావనను తీసుకొచ్చింది తొలి క్రైస్తవ సంఘ రచనలలో ప్రెస్బయిటర్ అంటే సంఘంలో 'పెద్దమనిషి' అని.

మహాసభ పట్టుబట్టి చెపుతున్నదేమిటంటే, ప్రెస్బిటర్‌లు, మరి ప్రజలు కలసి క్రీస్తు యాజకత్వంలో పాలుపంచుకొంటునప్పుడు, వారి యాజక ధర్మాలు భిన్నమైనవిగా ఉంటాయి. అవి అంతస్తులలో మాత్రమేగాక, వాటి విధము, రీతి, తరహాలో కూడా భేదమై ఉంటాయి. ప్రెస్బయిటర్‌లు మేలైన లేక ఎక్కువైన యాజకులని కాదు దీనర్థము. వారు వేరు విధమైన గురువులన్నమాట. రాచరికపు గురుకులంలో పరిచారక నాయకుల పాత్రను వారు నిర్వహిస్తారు. తొలి శ్రీసభలో ఒక్కొక్కసారి, సంఘం ఎన్నుకొని ఏర్పరచిన వారు ప్రెస్బిటర్లయినారు. ఐతే వారు కూడా గురు పట్టాభిషేకం పొంది, విశేష కృపావరం కలిగి సంఘంలో నాయకత్వ పాత్రను నెరవేర్చారు. ఇది లౌకిక ప్రజలకన్నా మిన్నగా వారిని పవిత్రులనుగా ఏమీ చెయ్యదు. ఎందుచేతనంటే ప్రజలుకూడా, రాజరికపు గురుకులం.

మరి గురువు అంటే ఎవరు? క్రీస్తు నిజమైన పరిపూర్ణమైన యాజకుడు. ప్రజలు ఆయన దైన పౌరోహిత్యంలో పాల్గొంటున్నారు. పౌరోహిత్య సంఘంలో ప్రెస్బిటర్లకు నాయకత్వ పాత్ర ఉంటుంది. ఇది కేవలం పదాల అర్థానికి సంబంధించిన విషయం కాదు. ఈ ప్రెస్బిటర్లను 'యాజకులు' అని పిలవడంతో మనం దైవ ప్రజల యాజకత్వాన్ని తక్కువచేసి మాట్లాడుతున్నాం. ప్రజల పౌరోహిత్యాన్ని కించపరచని రీతిలో మనము ప్రెస్బిటర్ల నాయకత్వ పాత్రను అర్థం చేసుకోవాలి, ప్రశంసించాలి, వారి కొరకు ప్రార్థన చేయాలి. ❀

*Courtesy : New Leader*




## జగద్గురువులు ఏర్పరచనున్న నలుగురు ఆసియా కార్డినల్స్

16వ బెనెడిక్టు పాపుగారు, వచ్చే అక్టోబరు నెలలో జరుగనున్న కాన్‌సిస్టరీలో మరి నలుగురు కొత్త కార్డినళ్ళను, ఆసియా ఖండానికి చెందిన వారిని ఏర్పాటు చేయనున్నట్టు, రోములోని ప్రత్యేక ప్రతినిధి జెరార్డ్ ఓ కొన్నెల్ వ్రాశారు. రోమునందలి అభిజ్ఞ వర్గాల కథనం ప్రకారం, ఎర్రటోపీలు యివ్వబడనున్నవారు.

1. జపాన్ దేశపు ఆర్చిబిషప్ పీటర్ టకేయో ఒకాడ,
2 శ్రీలంకకు చెందిన ఆర్చిబిషప్ మల్‌కోల్మ్ రంజిత్,
3. ఇండియా వారైన ఆర్చిబిషప్ తోమాస్ మేనం పరంపిల్
4. మియన్మార్ వారైన ఆర్చిబిషప్ చార్లెస్ మౌంగ్‌బో అనువారు.

## సిగ్నిస్ ఇండియా అధ్యక్ష పదవి వరించిన ఫాదర్ విన్సెంట్ చిన్నాదురైగారు

ది కమీషనర్ ఫర్ సోషల్ కమ్యూనికేషన్స్ ఆఫ్ తమిళనాడు బిషప్స్ కాన్ఫరెన్స్, సెక్రటరీగారైన ఫాదర్ చిన్నాదురైగారు, శాన్‌తోమ్ కమ్యూనికేషన్స్ సెంటర్ డైరెక్టర్‌గారైన వీరు, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ కమిషన్ ఛైర్మన్‌గారైన వీరు ఫాదర్ విన్సెంట్ చిన్నాదురైగారిని సిగ్నిస్ ఇండియా ప్రెసిడెంట్‌గా ఎన్నుకోవడం జరిగింది. సిగ్నిస్ ఇండియా అనేది, కమ్యూనికేషన్స్‌కు సంబంధించిన కతోలిక జాతీయ సంఘం. పాస్ట్రోల్ ఓరియెంటేషన్ సెంటర్, కోచి వద్ద జరిగిన సిగ్నిస్ ఇండియా వార్షిక సమావేశంలో ఫిబ్రవరి 7న వీరి ఎన్నిక జరిగింది. ఫాదర్ రప్పాయి పుదోకరన్ ఎస్.జె.గారి వారసులుగా వీరు ఆ పదవినలరిస్తారు.

## బైబిల్ వ్యాఖ్యానం కార్యాన్ని 15 యేండ్లలో ముగించనున్న సలేషియన్ గురువు

భారతీయ సలేషియన్ గురువు ఒకాయన యిప్పటికే తన 90వ జన్మదినోత్సవం జరుపుకొన్నాడు. తన ప్రేషిత కార్యాన్ని పూర్తి చేయడానికి యింకా 15 సంవత్సరాల ఆయుష్షుకొరకు ఆయన ప్రార్థన చేస్తున్నాడు.

ఫాదర్ సిల్వానుస్ సంగి లిండోగారు, పరిశుద్ధ గ్రంథ వ్యాఖ్యానం ఖాసీ భాషలో వ్రాస్తూ 20 సంవత్సరాలు గడిపారు. ఈశాన్య భారతంలో ఒక గిరిజన తెగకు చెందినది ఖాసీ భాష.

నేను ప్రారంభించిన ఈ కార్యము ముగించడానికి యింకా 15 సంవత్సరాల కాలాన్ని దేవుడు నాకు ప్రసాదించాల్సివుందని ఫాదర్ సిల్వానుస్‌గారన్నారు. తన గిరిజన జాతీయ దుస్తులు, తలపాగా, శాలువాలను ధరించి ఆయన దర్శనమిచ్చారు.

ఫాదర్ సిల్వానుస్‌గారు హోషేయ గ్రంథం వద్ద ప్రారంభించి 20 యేండ్ల కాలంలో 28 గ్రంథాలను పూర్తి చేశారు. ప్రస్తుతం వారు, పౌలు అపోస్తులు గలతీయులకు వ్రాసిన పత్రికపై వ్యాఖ్యానం వ్రాస్తున్నారు. "అపోస్తోలిక లేఖ ఐనందున, యిది చాలా ముఖ్యమైంది'' అని ఆయనన్నారు.

## భారతీయ గురువుల సభ : ఓ చారిత్రిక ఘట్టం

సి.సి.బి.ఐ. చరిత్ర సృష్టించింది. కమిషన్ ఫర్ క్లెర్జీ దాని ఉప విభాగమైన సిడిపిఐ ద్వారా, గురువుల సంవత్సరపు విశేష కార్యం ఐన భారతీయ గురువుల మహాసభను, ఫిబ్రవరి 9-11 తేదీల మధ్య నిర్వహించి కృతార్థులైనారు.

మొత్తం 820 మంది గురువులు, 16 మంది మేత్రాణులు కలిసి 857 మంది పాల్గొని సభను జయప్రదం చేశారు. కార్డినల్ ఓస్వాల్డ్ గ్రాషియాస్ వారి ఆహ్వానం మేరకు ఈ బృహత్తర కార్యం జరిగింది. కార్డినల్ ఓస్వాల్డ్ గ్రేషియాగారు సిసిబిఐ అధ్యక్షులు. కాంగ్రిగేషన్ ఫర్ క్లెర్జీకి పరిపాలకులైన కార్డినల్ క్లాదియొ హుమ్మెస్‌గారు ప్రతి సెషన్‌కు హాజరైనారు. ద ఛార్జ్ డి' అఫెయిర్స్ ఆఫ్ అపోస్టాలిక్ నున్షియో, ఢిల్లీ శ్రీ మోన్సిగ్నోర్ చిబాయికే ఒనాయోఘాల వారి సాన్నిధ్యం, ఆ సభలో శ్రీసభ నాయకత్వానికి గుర్తింపు తెచ్చింది.




## మానసిక మరియు లైంగిక అంశాలపై సదస్సు : సి.ఆర్.ఐ - హైదరాబాద్



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** ఫిబ్రవరి 20, 2010 నుంచి హైదరాబాద్ లోని అన్ని నోవిషియేట్ సభ్యులకు మానసిక పరమైన మరియు లైంగిక పరమైన అంశాలపై జరిగిన సదస్సులో పాల్గొన్నారు. ఇది వారి జీవితాలలో ఒక మంచి పునాది రాయి అని చెప్పవచ్చు. దీని మూలంగా వారు వారి జీవితాలను మరియు ఇతర వ్యక్తులు మానవత్వంతో దరిచేరుతారని అర్థమవుతుంది. మొత్తం 105 మంది నోవిసులు పాల్గొనగా దీనికి ఫాదర్ దేవదాస్ గారు చెన్నై నుంచి ముఖ్య అతిథులుగా విచ్చేశారు.



## డాన్‌బోస్కో టెక్నికల్ స్కూల్ పాత విద్యార్థుల సభ

**హైదరాబాద్, మార్చి 7:** ఫిబ్రవరి 21, 2010 రోజున మరొక్కసారి, జంటనగరాలలోని టెక్నికల్ స్కూల్ పూర్వ విద్యార్థులు ఒకచోట గుమికూడి, వారు నేర్చుకున్న విలువలను మరియు అలవరచుకున్న డాన్‌బోస్కో గారి విద్యా విధానాన్ని తమ తోటి ఉద్యోగులకు మరియు వారి తోటి స్నేహితులకు ఆదర్శంగా వుంటామని ప్రతిజ్ఞ చేశారు.

## ఐ.యస్.ఎఫ్.ఎఫ్.ఐ కి బహుమాన సన్మానము

**చెన్నై, మార్చి 16 :** మరొకసారి చెన్నైలో సినిమా సందడి చోటుచేసుకుంది. డాన్‌బోస్కో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్ ఆర్ట్స్ నందు ఎన్నో చిన్న తరహా సినిమాల ప్రదర్శనకు గొప్ప అవకాశం లభించింది. 2 సం॥ల క్రితం స్థాపించిన ఈ సంస్థ ఇప్పుడు ఎంతో గొప్పగా ఎన్నో సంస్థలకు కూడా సేవలను అందిస్తుంది. ఐ.యస్.ఎఫ్.ఎఫ్.ఐ 2010 అను కొత్త కార్యక్రమము తమిళనాడు ప్రభుత్వ మన్ననలను సహితం పొందుకుంది.

## డికన్లుగా అభిషిక్తులైన గురు విద్యార్థులు కె.జె.సి - బెంగుళూర్

**హైదరాబాద్, మార్చి - 20 :-** మొత్తం 24 మంది దైవశాస్త్ర విద్యార్థులు క్రీస్తుజ్యోతి కాలేజీలో పవిత్రమైన గురుత్వానికి ముందస్తు అయిన డికన్లుగా ఘనత వహించిన బిషప్ బెర్నర్డ్ మెరిస్ గారి చేతులమీదుగా అభిషిక్తులైనారు. అదేరోజు అనగా మార్చి 19, 2010, పునీత జోజప్పగారి పండుగ రోజు అవటం మరింత విశేషం. వారిలో మన తెలుగు వారు ఇద్దరు - నరిశెట్టి సాగర్ మరియు పిచ్చెముత్తు అరుల్‌దాస్ మన ప్రావిన్స్‌కు చెందినవారు.

## ఫాదర్ నికోలాస్ లోగ్రోయి గారి అకాల మరణం



**కలకత్తా, మార్చి 20 :** 72 సం॥రాలుగా తన సలేషియన్ మతజీవితాన్ని కొనసాగించి, కలకత్తా ప్రావిన్స్‌కు అధినేతగా, నోవిషియేట్‌కు మాస్టర్‌గా పనిచేసిన ఫాదర్ నికోలాస్ లోగ్రోయి గారు 16, మార్చి 2010న తుది శ్వాసను విడిచారు. ఆయనను బాన్‌డిల్ బసిలికాలో భూస్థాపితం చేశారు. దీనికి బిషప్ జోసఫ్ గోమెస్ యస్‌డిబి, రీజినల్ కనగ ఆరోగ్యం, మరియు తోమాస్ ఎల్లిచెరైల్ ప్రొవిన్షియల్ గార్లు హాజరయ్యారు.

# బైబిల్ క్విజ్

**యిర్మీయా గ్రంథం**
**1, 9, 17, 23, 29, 31, 33**

**సేకరణ : కె. రాజారెడ్డి, గుంటూరు**

1) యిర్మీయాను ఎప్పుడు ఎన్నుకొనెను?
2) ప్రభువు తన పలుకులను ఎవరినోట పెట్టెను?
3) యిర్మీయా 7: 5, 6, వచనములలో ప్రభువాణి తెలిపినదేమిటి?
4) ప్రభువు భూమిని ఏవిధముగా ఏలును?
5) ప్రభువు ఎవరిని దీవించును?
6) ఎవరు చికిత్స చేసినచో మనము సంపూర్ణ ఆరోగ్యమును బడయుదుము?
7) దావీదు వంశమునుండి ఎన్నుకొనబడిన నీతి గల రాజుకు ఏమని పేరిడుదురు?
8) ప్రభువు మనకు ఎటువంటి భవిష్యత్తును నిర్ణయించారు?
9) ప్రభువు ధర్మ శాస్త్రమును ఎక్కడ లిఖించెను?
10) మనము ప్రభువును పిలిచినపుడు ఏమిచేయును?

**2010 మార్చి నెల బైబిల్ క్విజ్ విజేతలు**

డి. ఉదయతార, యస్. ఫ్రాన్సీసమ్మ, కేసరపల్లి గన్నవరం
బి. విజయకుమారి గుడివాడ
డి. ప్రకాశమ్మ, గుంటూరు

**ఎడిటర్,**
**బోస్కోమార్గం**
డాన్‌బోస్కో టెక్నికల్ స్కూల్ ప్రెస్
రింగ్ రోడ్, గుంటూరు - 522 007
E-mail : boscomargam@gmail.com
Mobile : 9908246319

## రాజ్యసభలో మహిళా బిల్లు

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కంకణం కట్టుకున్న కాంగ్రెస్ పార్టీ కొన్ని సంవత్సరాలుగా మహిళలకు ఎక్కువ స్థానాలు కేటాయిస్తున్నది. గత 63 సంవత్సరాల్లో ఆ పార్టీ 295 మంది మహిళలను పార్లమెంటుకు పంపించింది. ఇప్పటి వరకు పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించిన మొత్త మహిళల్లో దాదాపు 53 శాతం మంది కాంగ్రెస్‌కు చెందినవారే. ఆరవ లోక్‌సభలో ఆ పార్టీ తరుపున ఆరుగురు మహిళలు మాత్రమే ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర శాసనసభలో మహిళా ప్రాతినిత్యం గురించి ఒకసారి పరికిస్తే పరిస్థితి ఏమంత గొప్పగాలేదు. ఇరవై ఎనిమిది రాష్ట్ర శాసనసభల్లో మొత్తం 4,030 మంది సభ్యులుగా ఎన్నిక కాగా వారిలో కేవలం 311 మంది మహిళా ఎమ్మెల్యేలు లేదా ఎనిమిది శాతం కంటె తక్కువగా ఉన్నారు. కొన్ని పార్టీల నిరసనల మధ్య మహిళా బిల్లు రాజ్యసభ ఆమోదం పొందింది. ఇప్పుడు ఈ బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి రంగం సిద్ధమవుతున్నది. బిల్లు చట్టంగా మారడానికి ముందు కనీసం సగం రాష్ట్ర శాసనసభలు ఆమోదముద్ర వేయాల్సి వుంది.

## పైరసీపై ఇక పోలీసుల ఉక్కుపాదం

సినీ పరిశ్రమను కుంగదీస్తున్న పైరసీపై ఉక్కు పాదం మోపేందకు పోలీసులకు ఎట్టకేలకు అధికారాలు లభించాయి. ఇంత వరకు ఉన్న చట్టాన్ని సర్కారు సవరించడంతోపాటు అసెంబ్లీలో బిల్లు తీసుకువచ్చేందుకు సిద్ధమవుతుండటంతో పోలీసులు కూడా తదుపరి చర్యలకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు కొత్త చట్టం ద్వారా వీడియో దుకాణాలపై ఎస్ఐల స్థాయిలో దాడులు జరిపేందుకు వీలుగా ఆదేశాలు జారీచేసేందుకు హోం శాఖ కసరత్తులు చేయసాగింది. సినిమాలు విడుదలయిన రెండవరోజే పైరసీ సిడిలు మార్కెట్లో రావడం, అంతకు ముందు విడుదలయ్యే పాటల సిడిల విషయంలోనూ ఇదే తంతు కొనసాగుతుండటం తెలిసిందే.

## గిట్టుబాటు ధర రాక... తట్టుకోలేక మిర్చి రైతుల కళ్ళల్లో నీళ్ళు


మిర్చ రైతులు వారు పండించిన పంటకు అధిక వ్యయంచేసి పండించినా దిగుబడి రావడం లేదు. ఎకరానికి రూ. 40 వేలు పెట్టుబడి పెడితే ఆరు, నుంచి ఎనిమిది క్వింటాళ్ళు మాత్రమే వస్తున్నాయి. తీరా మార్కెట్ యార్డుకు మిర్చి తీసుకుని వస్తే గిట్టుబాటు ధర దక్కడం లేదని పలువురు మిర్చ రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మిర్చి రైతుకు గిట్టుబాటు ధర ప్రకటించకపోవడంతో వారు కమీషన్ దారుల చేతిలో భారీగా నష్టపోతున్నారు.

BOSCO MARGAM - APRIL - 2010 RNI No. APVJ/GTR/3/2009-11 Postal Regn. GTR/3/2009-2011

# గురువుగా, బ్రదర్లుగా కావాలనుకునే వారికి శుభవార్త !



## రండి డాన్‌బోస్కో సభలో చేరండి




## 2010 డాన్‌బోస్కో దైవ పిలుపు సదస్సులు

డాన్‌బోస్కో-[illegible], ఏప్రిల్ 11-14
రామంతపూర్-హైదరాబాద్, ఏప్రిల్ 16-19
డాన్‌బోస్కో-మరియాపురం, ఏప్రిల్ 22-25
డాన్‌బోస్కో - కర్నూలు, ఏప్రిల్ 28-మే 1
డాన్‌బోస్కో - మంగళగిరి, మే 5-8
డాన్‌బోస్కో - గుణదల, మే 12-19

1. సదస్సులకు వారం ముందుగానైనా మీ రాకను తెలియజేస్తూ రిప్లయికార్డు వ్రాసి మీ పేరు నమోదు చేయించుకొనవలెను.
2. విచారణ గురువు మరియు తల్లి దండ్రుల సిఫారస్సు పత్రము తీసికొని రావలయును.
3. ఇతర సెమినరీల నుండి వచ్చే అభ్యర్థులు ఈ సదస్సులకు హాజరు కానవసరము లేదు.
4. బస్సులోగాని, రైళ్ళలోగానీ దూర ప్రాంతాలనుండి ప్రయాణించి వచ్చిన అభ్యర్థులు టిక్కెట్ వెల చూపించి, సదస్సులో పూర్తిగా పాల్గొన్న తరువాత అదే తిరుగు ప్రయాణపు ఖర్చులు పొందవచ్చును.
5. ఇంకా ఏమైన వివరాలు కావాలంటే ఈ క్రింది చిరునామాకు సంప్రదించండి.

**ఫా. శౌరిలు యస్.డి.బి.** వొకేషన్ డైరెక్టర్, డాన్‌బోస్కో నిలయం
కార్మెల్ నగర్, గుణదల, విజయవాడ - 520 004 ఆంధ్ర ప్రదేశ్.
ఫోన్ : 0866 2450 386, 2451660, 9949448053

**BOOK - POST**

To

.........................................................

.........................................................

.........................................................

.........................................................

*If it is not Delivered Please Return to :*

DON BOSCO TECHNICAL SCHOOL PRESS
Ring Road, GUNTUR - 522 007.
A.P. INDIA. Ph: (0863) 2350832

Printed & Published by Fr. Sebastian John and Printed at the Don Bosco Technical School Press and published from the same Don Bosco Technical School Press, Ring Road, Guntur - 522 007. Editor Fr. Sebastian John, sdb.